నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
శనివారం | 23 మార్చి 2024 | www.navatelangana.com



కేజ్రీవాల్ అరెస్టు దుర్మార్గం

సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఈడి అధికారులు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఇంట్లో సోదాలు నిర్వహించి అరెస్టు చేయడాన్ని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు తీవ్రంగా ఖండించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఢిల్లీ ప్రజలను భయకంపితులను చేసి ఎన్నికలలో లాభపడాలని, ఇండియా బ్లాక్ పార్టీలను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. బిజెపి కక్షపూరిత ప్రతీకార చర్యలను, నిరంకుశ పద్ధతులను ప్రతి ఒక్కరు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కమీషన్ జోక్యం చేసుకొని ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతిపక్షాలు ప్రత్యేకించి ఇండియా బ్లాక్ పార్టీలపై రాజకీయ కక్షపూరిత చర్యలను ఆపాలని విజ్ఞప్తి చేశారు.

యజమాన్య నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

స్టాండర్డ్ గ్లాస్ పరిశ్రమ యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి

సీఐటీయు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య డిమాండ్



నవతెలంగాణ - ఐడిఎ బొల్లారం

గడ్డపోతారంలోని స్టాండర్డ్ గ్లాస్ పరిశ్రమలో గురువారం ప్రమాదం జరిగింది, ఈ ప్రమాదంలో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన కార్మికునికి వైద్య చికిత్స పరిశ్రమ యజమాన్యమే చేయించాలని, విధుల్లోకి వచ్చేదాకా వేతనం చెల్లించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కె. రాజయ్య డిమాండ్ చేశారు. పరిశ్రమ యజమాన్యం నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం జరిగిందని ఆయన ఆరోపించారు, ప్రమాదాలు జరగకుండా యజమాన్యం చర్యలు తీసుకోలేదని అన్నారు, కనీసం పరిశ్రమలో అంబులెన్స్ కూడా లేదని అన్నారు. కార్మికునికి తీవ్రంగా గాయపడడానికి కారణం యజమాన్యమే అని అన్నారు. కార్మికుని ఆదుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ ,సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారమే సీఐటీయూ లక్ష్యం

కార్మిక అనుకూల వేతన ఒప్పందం కోసం ఐక్యంగా పోరాడుదాం

సిఐటియు జిల్లా అధ్యక్షులు బి మల్లేష్



నవతెలంగాణ - జిన్నారం

కార్మిక వర్గాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిఐటియు కృషి చేస్తుందని, అత్యుత్తమైన కార్మిక వేతన ఒప్పందల కోసం అవిశ్రాంతంగా పోరాటాలను కొనసాగిస్తోందని సంగారెడ్డి జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు బి మల్లేశం అన్నారు. జిన్నారం మండల పరిధిలోని కాజీపల్లి పారిశ్రామికవాడలో గల శుక్రవారం నిర్వహించిన టిఐడిసి పరిశ్రమ కార్మికుల గేట్ మీటింగ్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పరిశ్రమలో రాబోయే రోజుల్లో కార్మిక అనుకూల వేతన ఒప్పంద కోసం కృషి చేస్తామన్నారు. నిరంతరంగా కార్మిక వర్గాల పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే రాజయ్య, పరిశ్రమ యూనియన్ నాయకులు భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్, సత్తయ్య, వెంకటేశ్వర్లు, సిఐటియు శ్రేణులు పాల్గొన్నారు.

కులమత బేధాలు లేకుండా

సమాన హక్కులతో జీవించాలి

మల్లన్న ఆలయంలో రేణుకాచార్య జయంతి



నవతెలంగాణ - కొమురవెల్లి

కుల మత వర్ణ వర్గ విభేదాలు లేకుండా మానవులంతా సమాన హక్కులతో జీవించాలని మల్లన్న ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ఆది జగద్గురు రేణుకాచార్య జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మల్లన్న ఆలయంలో ఉన్న రేణుకాచార్య మఠంలో స్వామికి రుద్రాభిషేకము విశేష ద్రవ్యంతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, అర్చకులు మహదేవుని సాంబయ్య, పడిగన్న గారి ఆంజనేయులు, పడిగన్న గారి మల్లికార్జున్, భాస్కర్ ,మనోహర్, రవి, రేవన సిద్దేశ్వర్, శివకుమార్, సూర్య, శివప్రసాద్, రాజు, ఆగమ పాఠశాల అధ్యాపకులు వీరేశలింగం ,విద్యార్థులు పాల్గొన్నారు

మోడీ నియంతృత్వాన్ని అంతమొందిస్తాం



నవతెలంగాణ-అక్కన్నపేట

మోడీ నియంతత్వ పోకడలను అంతమొందిస్తామని యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పాంత్రాల దాము అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అవలంబిస్తున్న నియంతృత్వ విధానాన్ని ఖండిస్తున్నామని అన్నారు. మోడీ ప్రభుత్వం ఎవరైతే బిజెపికి వ్యతిరేకంగా ఉన్న వాళ్లను బెదిరిస్తూ, అదేవిధంగా అకౌంట్లోను బాండ్లను లాక్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. బీజేపీని గద్దె దించే రోజులు త్వరలోనే రానున్నాయని అన్నారు. త్వరలో రాహుల్ గాంధీ ప్రధాని అవ్వబోతున్నారని, పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ జనరల్ సెక్రెటరీ త్రిమూర్తి, పట్టణ యూత్ అధ్యక్షులు దేవుని రాజు, చౌటపల్లి గ్రామ శాఖ యూత్ అధ్యక్షులు ఆవుల వెంకటరాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నీటిని సంరక్షించి, కోట్లాది జీవులను రక్షించాలి

నవ తెలంగాణ -మిరుదొడ్డి

ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండలం ఆరేపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నీటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి, భవిష్యత్తు తరాలను కాపాడుకుందామని తెలిపారు. ప్రతి ఒక్కరు నీటిని సంరక్షించి, కోట్లాది జీవులను రక్షించుకోవాలని సూచించారు. విద్యార్థులు అనవసరంగా నీటిని వృధా చేయవద్దని, నీటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అలయన్స్ క్లబ్ కు మూడు అవార్డులు



నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట జిల్లా అలయన్స్ క్లబ్‌కు మూడు బెస్ట్ అవార్డులు వచ్చినట్లు జిల్లా గవర్నర్ సోమ వనజ తెలిపారు. అలయన్స్ అంతర్జాతీయ సదస్సు ఈ నెల 16 , 17న ఆగ్రాలో నిర్వహించారు. 28 దేశాల నుండి అలయన్స్ ప్రతినిధులు, దేశీయ ఆలయన్స్ ప్రతినిధులు హాజరయ్యారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ తనకు బెస్ట్ గవర్నర్ అవార్డు , బెస్ట్ సెకండ్ వైస్ గవర్నర్ గా చకిలం బాలచంద్రంకి ,ఐసీసీ గా మోరఅంజయ్యకి అవార్డులు వచ్చినట్లు తెలిపారు. అలయన్స్ అంతర్జాతీయ అధ్యక్షులు పంకజ వాస్తవ ఆగ్రాలో అవార్డులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చకిలము బాలచంద్రం , మోర్ అంజయ్య, పాస్ట్ గవర్నర్ రాజేశ్వర్ రెడ్డి, సెకండ్ వైస్ గవర్నర్ శివకుమార్ , థర్డ్ వైస్ గవర్నర్ పెద్ది రామచంద్రం, జోన్ చైర్మన్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ప్రాథమిక పాఠశాల అధ్యక్షురాలు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నెల్లుట్ల మమత, కన్వీనర్ గా పొన్నమొల్ల రాములు, సభ్యులుగా సామంతుల రజిత, బస్వారాజు అనిత, ఏటి స్వప్న, శామంతుల లాస్య, రుత్విక, గుండెలి అనూష, ఎర్ర యాదవ్వ, గుండెల్లి స్వాతి, చామంతుల సంతోషా, ఏటి శోభ, కొండపర్తి రాధిక, రంగు మమత, తడకపల్లి సురేఖ, కీర్తి స్వప్న, రేబర్తి అంజలి, ఏటి రజిత లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఏ భాగ్య, పాఠశాల ఉపాధ్యాయులు భూపాల్ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు

రిటైర్డ్ ఇంజినీర్ లక్ష్మీనారాయణకు గుండెపోటు

నవతెలంగాణ-తొగుట : రిటైర్డ్ ఇంజినీర్ దొంతుల లక్ష్మీనారాయణకు గుండె పోటు వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆయన్ని ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం మల్లన్నసాగర్ ముంపు గ్రామం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన దొంతుల లక్ష్మీ నారాయణ గత సోమవారం రోజున గుండెపో టు రావడంతో హైదరాబాద్ లోని దుర్గాబాయ్ దేశముఖ్ ఆస్పత్రిలో చికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టును నిర్మాణం చేసే సమయంలో ముంపు గ్రామాల ప్రజలకు, రైతులకు ప్రాజెక్టు గురించి వివరించారు. ఈ ప్రదేశంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి అనువైన ప్రదేశం కాదని, మల్లన్నసాగర్ నిర్మాణం చేస్తే భవిష్యత్ లో ఇబ్బందులు జరుగుతాయని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తరువాత కోర్టులను సైతం ఆశ్రయించారు. గుండెపోటుకు గురైన లక్ష్మీ నారాయణ ను ఆయన మిత్రులు ఆస్పత్రిలో పరామర్శించారు.

మండుటెండలో... ఉపాధి కూలీలు

- వంద రోజుల పని అరకొరే
- జియోట్యాగింగ్ వల్ల తిప్పలు
- పనెంత చేసినా కూలీ అంతంతే
- నీడ, నీళ్లు లేక కూలీలు విలవిల



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మండుటెండల్లో ఉపాధి కూలీలు మగ్గిపోతున్నారు. నీడ, నీళ్లలేక విలవిలలాడుతున్నారు. పనెంత చేసినా కూలీ మాత్రం గిట్టట్లేదు. ఎంత పనిచేశారనేది కొలతలేస్తున్నప్పటికీ కేంద్రం కొత్తగా జియో ట్యాగింగ్ పద్ధతి తెచ్చి కూలీలకు తిప్పలు తెచ్చింది. ఏడాదిలో ఒక కుటుంబానికి కనీసం వంద రోజులైనా పని కల్పించాల్సి ఉన్నా అరకొర కుటుంబాలకే పని కల్పించారు. పని చేసే చోట ప్రమాదాలకు గురైతే ప్రథమ చికిత్స కిట్స్ కూడా లేని పరిస్థితి ఉంది. వారాలు గడిచినా వేతనాల బిల్లు ఇవ్వని పరిస్థితి ఉంది. పెండింగ్ బిల్లులు చెల్లించడంలోనూ తీవ్ర జాప్యం జరుగుతుందని కూలీలు ఆవేదన చెందుతున్నారు.

రెక్కాడితే తప్ప డొక్కాడని కూలీలు కుటుంబ పోషణ కోసం జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్నారు. రోజు కూలి ఎంత వస్తుందో తెల్వక అయోమయానికి గురవుతూనే చేతులు కాయలు కాజేలా పనిచేస్తున్నారు. చేసిన పనికి ఎంత కూలీ పడుతుందో తెల్సుకునేందుకు కూలీలకు స్లిప్‌లు ఇవ్వట్లేదు. సంగారెడ్డి జిల్లాలో 237725 మంది ఉపాధి కూలీలు, మెదక్ జిల్లాలో 2.22 లక్షల మంది, సిద్ధిపేట జిల్లాలో 3.01 లక్షల మంది ఉపాధి హామీ పథకంలో నమోదై ఉన్నారు. వీరందరికీ ప్రతి గ్రామంలో రోజుకు కనీసం 50 నుంచి 100 మంది కూలీలకైనా పని కల్పించాలి. గ్రామంలో గుర్తించిన పనులు చేసేందుకు కూలీలు హాజరయ్యేలా చూడాలి. ఉపాధి పథకంలో రోజువారిగా కూలీల హాజరు పెంచేలా లక్ష్యాలు నిర్దేశించి పనిచేస్తున్నప్పటికీ పని చేసేందుకు కూలీలు ఎగబడి వస్తున్నదేమీలేదు. చేసిన పనికి సరిపడ కూలీ గిట్టుబాటు కాకపోవడంతో పేదలు ప్రత్యామ్నాయ పనులకు వెళ్తున్నారు.

మండుటెండల్లో...

మార్చి చివరి వారంలోనే ఎండల తీవ్రత పెరగుతోంది. ఇటీవల అకాల వర్షాలు పడడంతో వారం పాటు వాతావరణం కాస్త చల్లబడింది. రెండు రోజులుగా మళ్లీ ఎండల తీవ్రత పెరుగుతూ వస్తుంది. ఏప్రిల్, మే మాసాల్లో పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటే అవకాశముంది. ప్రకృతిలో వచ్చిన మార్పుల వల్ల ఈ సారి ఎండల తీవ్రత గతం కంటే పెరగవచ్చని వాతావరణ శాఖ వెల్లడించింది. ఒంటిపూట బడులు పెట్టారు. కూలీలు సైతం ఎండల్లో పనిచేస్తున్నందున చలువ పందిళ్లు, పట్టాలు, తార్పాలిన్లు కట్టి నీడ కల్పించాలి. అదే విధంగా పని చేసే ప్రాంతంలో అందుబాటులో తాగునీరు, ప్రథమ చికిత్సకు సంబంధించినవి ఉంచాలి. ఇవేవీ పని చేసే ప్రదేశాల్లో ఉండట్లేదు. పార పలుగు పట్టి ఎండల్లో మగ్గుతూ పనిచేస్తున్నారు. చేతులు పొక్కులొచ్చి ఇబ్బందులు పడుతున్నారు. పైగా కనీసం సేద తీరేందుకు ఏలాంటి నీడ లేకపోవడంతో ఎండలకు కూలీలు అల్లాడిపోతున్నారు. అదే విధంగా తాగునీరు సైతం ఇంటివద్ద నుంచి బాటిల్స్‌లో తెచ్చుకోవడం వల్ల అవి చాలట్లేదు. పైగా ఎండలకు వేడెక్కి తాగడమే కష్టంగా మారుతుంది. పని ప్రదేశాల్లో చల్లని నీటిని అందుబాటులో ఉంచాలని కూలీలు కోరుతున్నారు.

లక్షలం చేరని వంద రోజుల పని దినాల కల్పన

2023-24 ఆర్థిక సంవత్సరం ముగియవస్తుంది. ఈ ఏడాది కాలంలో మూడు జిల్లాల్లో ఆయా జిల్లాల వారిగా ఎన్ని కుటుంబాలకు వంద రోజుల పని దినాలు కల్పించాలనే ముందే నిర్ణయించారు. ఈ మేరకు పై స్థాయి



సిబ్బంది కింద పనిచేసే వాళ్లకు టార్గెట్స్ విధించారు. సంగారెడ్డి జిల్లాలో 4845 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పని కల్పించారు. మరో 63 వేల మంది కూలీలకు 100 రోజుల పని కల్పించాలనే లక్ష్యానికి చేరుకోలేకపోయారు. సిద్ధిపేట, మెదక్ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. వంద రోజుల పని కల్పించడం ద్వారా ఆ కుటుంబానికి ఏడాది కాలంలో పని లేక ఆకలితో అలమటించే పరిస్థితి ఉండదు. మార్చి 31తో 2023-24 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈ లోపు వంద రోజుల లక్ష్యాని చేరుకోవడం వీలుకాని పరిస్థితి ఉంది. గ్రామాల్లో హరిత హారం, ఇంకుడు గుంతలు, చెర్వుల్లో పూడికతీత పనులు, కాల్వలు, పాంపాండ్, రాళ్లు ఏరడం వంటి పనులు చేయిస్తున్నారు.

జీయో ట్యాగింగ్ తిప్పలు

కేంద్రం కూలీలు చేస్తున్న పనికి కొలతలు వేసి కూలీ చెల్లిస్తుంది. దీనికి తోడు ఇటీవల ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు జీయో ట్యాగింగ్ పద్ధతి పెట్టారు. దీని వల్ల కూలీలు పనిని ప్రారంభించిన చోట ఫోటో తీస్తారు. అక్కడి నుంచి సాయంత్రం సమయమయ్యే వరకు ఎక్కడి వరకు వెళ్లి పనిచేస్తారో అక్కడి నుంచి పని ప్రారంభించిన చోటికే వచ్చి ఫోటో దిగాలి. అలా రోజులో నాలుగు సార్లు కూలీల ఫోటోల్ని అప్‌లోడ్ చేయాలి. అలా చేయకపోతే చేసిన పని సర్వర్‌లో లెక్కించబడదు. కూలీలు పని మొదలు పెట్టి చేసుకుంటూ చివరి వరకు వెళ్లి పనిని ముగిస్తారు. మళ్లీ పని ప్రారంభించిన చోటికెళ్లి ఫోటో తిగాల్సి వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా చెబుతున్నారు.

సార్ పరార్..





- అజ్ఞాతంలోకి రూరల్ ఎస్ఐ అమర్
- ఏసీబీ రైడ్ తరువాత కనిపించని అధికారి
- ఇసుక ట్రాక్టర్ రిలిజింగ్‌లో సార్ వాటా ఎంతో..?

ఏసీబీ రైడ్‌తో ఉలిక్కిపడిన ఓ సారు ఊరు వదిలి ఉన్నపలంగా పరారయ్యాడు. రోజూ వారీగా విధులకు హాజరుకావాల్సిన ఆ అధికారి ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. దీంతో ఇసుక ట్రాక్టర్ రిలేజింగ్ విషయంలో సార్ వాటా ఎంతో అని చర్చ జరుగుతోంది.

నవతెలంగాణ-మెదక్

మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రైటర్ బి.సురేందర్ అవుసులపల్లికి చెందిన కందుల చంద్రం(రాము) అనే వ్యక్తి నుంచి ఇసుక ట్రాక్టర్ రీలీజింగ్ విషయంలో రూ. 4 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. అయితే అధికారులు జరిపిన విచారణలో కానిస్టేబుల్ సురేందర్ రూ.4 వేలకు ముందు తీసుకున్న రూ.15 వేలను సార్‌కు ఇచ్చానని చెప్పినట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ వెల్లడించారు. ఆ సార్ ఎవరూ అనే విషయాన్ని విచారణలో తెలుసుకుంటామని ఏసీబీ అధికారులు తెలిపారు. కాగా ఏసీబీ దాడులు జరిగిన రోజు నుంచి రూరల్ ఎస్ఐ అమర్ విధులకు హాజరుకాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. నాలుగు రోజులుగా ఉన్నతాధికారులకు ఎలాంటి సంచారం ఇవ్వకుండా ఎస్ఐ అమర్ విధులకు హాజరుకాకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయితే ఏసీబీ రైడ్ జరిగినప్పటి నుంచి ఎస్ఐ పరారీలో ఉండటం పలు అనుమానాలకు తావిస్తుంది. కానిస్టేబుల్ సురేందర్ రూ.15 వేలు ఇచ్చానని చెప్పిన సార్ ఇతడేనా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు సైతం మిన్నకుండిపోవడం గమనార్హం.

రేషన్ బియ్యం లోడు ఎత్తుకెళ్లిన దుండగుల రిమాండ్

ఆరుగురిపై కేసు నమోదు

సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య

నవతెలంగాణ - జోగిపేట



అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వారిని అడ్డగించి, బియ్యం లోడును అపహరించిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య తెలిపారు. శుక్రవారం జోగిపేట సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 16న ఉదయం 4 గంటల ప్రాంతంలో చందానగర్ నుంచి నారాయణఖేడ్ వైపు బొలేరో వాహనంలో అక్రమంగా 40 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తున్నారు. తాడ్దాన్‌పల్లి నుంచి బోలేరో వాహనాన్ని స్విఫ్ట్ డిజైర్ కారులో ఉన్న ఐదుగురు వ్యక్తులు వెంబడించి అందోలు మండలం సంగుపేట వద్ద బొలేరో వాహనాన్ని అడ్డుకున్నారు. స్విఫ్ట్ కారును అడ్డుగా పెట్టి అందులో ఉన్న డ్రైవర్ తో పాటు మరో వ్యక్తిని బలవంతంగా బయటకు దింపి వారి చేతులు కట్టేసి తమ వాహనంలోకి ఎక్కించుకున్నారు. బోలేరో వాహనాన్ని ఐదుగురిలో సోహైల్, ఆహ్మద్‌లు నడుపుకుంటూ స్విఫ్ట్ కారును వెంబడి హద్నూర్ వైపు వెళ్లారు. అక్కడ అశోక్ లీలాండ్ ట్రాలీతో మరొక వాహనాన్ని సిద్ధంగా ఉంచారు. ఆ వాహనంలో బొలేరోలో ఉన్న 40 బస్తాల బియ్యంను లోడ్ చేయగా అఫ్రోజ్ బియ్యంలోడ్ వాహనాన్ని తీసుకొని జహీరా బాద్ వైపు తీసుకొని పారిపోయాడు. బొలేరో వాహనాన్ని, అందులోని వ్యక్తులను వదిలి స్విఫ్ట్ కారులో పారిపోయారు. తమపై దాడి చేసి బియ్యం లోడ్‌ను ఎత్తుకెళ్లిన వారిపై జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో మెగావత్ పూలసింగ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తును చేపట్టారు. బియ్యంను ఎత్తుకెళ్లిన మహ్మద్ సొహేల్, ఎండీ షఫీఖాన్, ఎండీ ఇలియాస్, సొహేల్, ఎండీ అఫ్రోస్, ఎండీ ఆహ్మద్‌లను జహీరాబాద్ ప్రాంతంలో అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 40 బియ్యం సంచుల బియ్యాన్ని స్వాధీన పరచుకున్నట్లు డి.ఎస్.పి తెలిపారు. ఈ కేసులో నిందితుల్లో సొహేల్, ఆహ్మద్ పరారీలోఉన్నారని ఆయన తెలిపారు. ఈ కేసులో జోగిపేట సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్, ఎస్సై 2 మొగులయ్య, పాటు సిబ్బందిని అభినందిస్తూ, వారికి రివార్డులు వచ్చేలా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

గీతంలో ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం



నవ తెలంగాణ - పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ప్రపంచ నీటి దినోత్సవాన్ని' శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 'శ్రేయస్సు, శాంతి కోసం జలం అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.ఉమాదేవి మాట్లాడుతూ, జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ, వాతావరణంలో మార్పులు పెరుగుతున్న సవాళ్ల నేపథ్యంలో నీటి సంరక్షణ ప్రాముఖ్యత పెరిగిందన్నారు. నీటి కొరతను పరిష్కరించడానికి అందరికీ స్వచ్ఛమైన నీటిని అందించడానికి సమిష్టి కృషి అవసరమని ఆమె నొక్కి చెప్పారు. సామరస్యాన్ని పెంపొందించడంలో, శ్రేయస్సును సృష్టించడంలో, భాగస్వామ్య సవాళ్లకు స్థితిస్థాపకతను పెంపొందించడంలో నీటి పాత్ర అమూల్యమైనదన్నారు.

రుద్రారం ఉన్నత పాఠశాలలో అవగాహన

రసాయన శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టీ.బీ.పాత్రుడు, తోటి ఆధ్యాపకులు, బీఎస్సీ విద్యార్థులతో కలిసి డాక్టర్ ఉమ రుద్రారం ఉన్నత పాఠశాలలో నీటి సంరక్షణ ప్రాముఖ్యతపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. నీటి వనరులను కాపాడుకోవడంలో తను నిబద్ధతను ప్రదర్శించేలా విద్యార్థులు, అధ్యాపకులు నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులలో సృజనాత్మక ఆలోచనలు రేకెత్తించి, నీటి సంరక్షణపై మరింత అవగాహన కల్పించేందుకు గోడ పత్రిక రూపకల్పన పోటీలు, ముఖానికి రంగులు వేసుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. విజేతల ప్రతిభను గుర్తించడంతో పాటు నీటి సంరక్షణ కార్యక్రమాలలో వారంతా చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు గాను బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. సుస్థిరమైన నీటి నిర్వహణ, అందరికీ స్వచ్ఛమైన నీటిని అందించే దిశగా పనిచేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగ తప్పనిసరి



నవ తెలంగాణ - సిద్దిపేట

ఆరోగ్యమే మహాభాగ్యమని, సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగ తప్పనిసరని యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ వికాస్ అన్నారు. స్థానిక వ్యాసమహర్షి యోగ సెంటర్ లో యూనియన్ బ్యాంక్ సిద్దిపేట ఉద్యోగులకు ప్రత్యేకంగా యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆఫీసులోనే ఎక్కువ సమయం మనము గడుపుతున్నామని, దీనివలన శారీరక కదలికలు కూడా తక్కువగా ఉన్నాయని, రోజురోజుకు మానసిక ఒత్తిడిలు పెరుగుతున్నాయని అన్నారు. బిజీ లైఫ్ కారణంగా చిన్న వయసులోనే అనేక శారీరక మానసిక వ్యాధులు వస్తున్నాయని, ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు యూనియన్ బ్యాంకు లో పనిచేస్తున్న ఉద్యోగుల ఆరోగ్యమే లక్ష్యంగా యోగా తరగతులను దేశవ్యాప్తంగా ప్రారంభించారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ వీర రాఘవ, ప్రముఖ యోగా శిక్షకులు తోట సతీష్, సంధ్య, సీనియర్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, ఉద్యోగులు సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ పాటర్న్ చిప్ప ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా ఎంపిక చేయాలి

టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ గా ఎంపిక చేసి అభివృద్ధి చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం యుటిఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి 23వ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి యుటిఎఫ్ కార్యాలయం లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞాన మంజరి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సాయిలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మండలానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలతో అద్భుతంగా తీర్చిదిద్ది విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అందిస్తామని సంకల్పించడం బాగుందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ గా ఇప్పటికే మండల కేంద్రాల్లో నడుస్తున్న జెడ్పి, ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేయాలని కోరారు.అప్పారి వెంకటస్వామి ఆశయాల సాధనకై టీఎస్ యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా కమిటీ నిరంతరం కృషి చేస్తుందని, వారి స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికై , ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికై ఐక్య ఉద్యమాలు నిర్మిస్తుందని తెలిపారు. ప్రత్యేక టెట్ పరీక్ష నిర్వహించి ఉపాధ్యాయుల పదోన్నతులు వెంటనే చేసి, బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పి. శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శిలు బి. సాయి తేజ, ఆర్. సింహాచలం, నాయకులు ఎం. విజయానంద్, నరేందర్, మనోహర్, మురార్జీ, సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.....

హిందూ ధర్మ ప్రచార సమితి పాదయాత్ర

నవ తెలంగాణ - జిన్నారం



మండల కేంద్రమైన జిన్నారం నుండి కొడకంచి ఆదినారాయణ స్వామి దేవాలయం వరకు జిన్నారం మండల హిందూ ధర్మ ప్రచార సమితి ప్రతినిధి బృందం శుక్రవారం ప్రత్యేకంగా పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామ మందిరం యాదిలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పాదయాత్ర కార్యక్రమంలో వడ్ల ఆనంద్ చారి, రవి, నరసింహారెడ్డి, గొర్ల శ్రీనివాస్ యాదవ్, బ్రహ్మేంద్ర ,రాజ భార్గవ్, అశోక్, రామ్మూర్తి, శ్రీకాంత్ బాల గౌడ్ భాస్కర్ బృందం పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీ కి చెందిన బండ శ్రీనివాస్ రెడ్డి విజయ లక్ష్మి దంపతుల కుమారుడు సంతోష్ రెడ్డి నిఖితా వివాహానికి శుక్రవారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొలను రవీందర్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో శేషా రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, జనార్ధన్ రావు, సింహాచలం, కాంతారావు,యాదగిరి, కృష్ణ,అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగన్ని కాపాడుకుందాం

- విద్య, వైద్యం,ఉపాధి, కోసంపోరాటం
- కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్



నవతెలంగాణ-సంగారెడ్డి

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని విద్య, వైద్యం,ఉపాధి, కోసం పోరాటం చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం సుందరయ్య భవన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి. అశోక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగముందు మనుషులందరూ సమనమేనని అంటుందని అన్నారు. కానీ మనువాదులు భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు చేస్తున్నారని భారత రాజ్యాంగం స్థానంలో మనుశాస్త్రం తీసుకురావాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాస్తున్నారని భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులందరిదని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాల విధానాల వల్ల విద్యా, వైద్యం కార్పొరేట్ మయం అవుతున్నాయని ఇది ఏమాత్రం క్షేమం కాదని అన్నారు.ప్రైవేటీకరణ వల్ల రిజర్వేషన్లు లేకుండా పోతున్నాయి అని అన్నారు. దళితులు గిరిజనులు బలహీనవర్గాలు మహిళలకు నష్టం జరుగుతదని అన్నారు. ప్రభుత్వరంగాన్ని బలోపేతం చేసుకుందామని అన్నారు. కార్పొరేట్ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం. శివకుమార్, బి. రాజు, సహాయ కార్యదర్శులు మల్లేశం, దాస్ జిల్లా కమిటీ సభ్యులు దత్తు గంగారం, చరణ్, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

మంత్రిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదు

- బిబీ చౌటకూర్ మండల
- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్

నవతెలంగాణ-పుల్కల్



వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని చౌటకూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ అన్నారు. గత పది సంవత్సరాల్లో చేయలేని అభివృద్ధి పనులు కేవలం 100 రోజుల్లో పుల్కల్ ఉమ్మడి మండలానికి 40 కోట్ల నిధులు కేటాయించిన ఘనత మంత్రి దామోదర్‌తోనే సాధ్యమైందన్నారు. ఇప్పటివరకు పుల్కల్ ఉమ్మడి మండలానికి గతంలో పాలించిన పాలకులు ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా నియోజకవర్గంలోని గ్రామాలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆందోల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు గాను వేల కోట్ల రూపాయలు మంజూరు చేసి ప్రతి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణాలు చేసారన్నారు. అంతేకాకుండా కేవలం పుల్కల్ ఉమ్మడి మండలానికి 40 కోట్ల నిధులు మంజూరు చేయడంతో పాటు ప్రతి గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలనే దృఢనిశ్చయంతో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. త్వరలోనే సింగూరు ప్రాజెక్టును టూరిజం చేసేందుకు 180 వేల కోట్లు మంజూరు చేయడం ఎంతో సంతోషదాయకమన్నారు. మంత్రి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక తమ మంత్రి దామోదర్ రాజనర్సింహ పై ఇకముందు అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు.

పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యలను పరిష్కరించాలి

- ఆల్ ఇండియా సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నవతెలంగాణ-హత్నూర

పెండింగ్లో ఉన్న ధరణి భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆల్ ఇండియా సమత సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దళిత రత్న అవార్డు గ్రహీత సాయమోల నర్సింగ్ రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి వెబ్‌సైట్ లో లోపాల మూలంగా రాష్ట్రంలో చాలామంది రైతులు తమ భూములను కోల్పోయి వేరే వాళ్ళ పాసు పుస్తకాలలో ఎక్కిన మూలంగా రైతులు ఆవేదన చెందారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో చాలా మంది రైతులు ధరణి మూలంగా నష్టపోయి తాసిల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఉన్నారని ఆయన ఆవేదన చెందారు.

రాష్ట్ర అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడిగా శ్యామ్ నాథ్ శర్మ

నవతెలంగాణ-జోగిపేట



రాష్ట్ర దూప దీప నైవేద్యం అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు అందోలు గ్రామానికి చెందిన చిదిరె శ్యామ్‌నాథ్ శర్మ రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన్ను ఎంపికచేశారు. సందర్భంగా శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు వాసుదేవ శర్మ, ప్రధాన కార్య దర్శి అన్నవర్జుల ప్రసాద్ శర్మలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని, సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా శాలివాహన చక్రవర్తి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - పుల్కల్



శాలివాహన చక్రవర్తి జన్మదిన వేడుకలను శుక్రవారం మండల పరిధిలోని పోచారం గ్రామంలో జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జన్మదిన వేడుకలను జరుపుకున్నారు ఈ సందర్భంగా కుమ్మరి పాండరి మాట్లాడుతూ అతని గురించి అనేక విరుద్ధమైన ఇతిహాసాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి లక్ష్మణ్, కుమ్మరి యాదయ్య కుమ్మరి రాజు, నాగేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి : పద్మజారాణి

నవతెలంగాణ-సంగారెడ్డి



ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా రెవిన్యూ అధికారి పద్మజారాణి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశమందిరంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా, ఎన్నికల నియమావళి పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఈ నెల 16 నుండి అమలులోకి వచ్చిందని అన్నారు. ఎన్నికల ప్రచారానికి సభలకు సమావేశాలకు, వాహనాల అనుమతులు, బహిరంగ సభలకు అనుమతులన్ని సువిధ ఆప్‌లోనే పొందాలని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనకు పాల్పడరాదని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి లో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు తమ ప్రచార వివరాలను తెలియజేయాలని తెలిపారు.ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించినట్లు సమాచారం ఉంటే ఫోటోలు, వీడియోలను ఈసిఐ కల్పించిన సి విజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చులు వివరాలు కోసం కొత్త బ్యాంకు ఖాతాను తెరవాలని తెలిపారు. బ్యాంకు ఖాతాల ద్వారా జరిగిన జమ, ఉపసంహారణలు, నగదు లావాదేవీలు ఖర్చుల రసీదు ల వివరాలు పూర్తిగా నమోదు చేయాలని అన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోని సహాయ ఎన్నికల పరిశీలకులు షాడో రిజిస్టర్లో నమోదు చేస్తున్న లెక్కలతో సరి చూసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఏవో పరమేష్, వివిధ రాజకీయ పార్టీ ల ప్రతినిధులు తాహెర్ పాషా, తారాసింగ్, అతిమేల మాణిక్, రాములు శ్రీధర్ రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తొట్టెల ,పుట్టు వెంట్రుకల్లో ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-కల్హేర్

కల్హేర్ మండలంలోని మీరాన్ పేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ వార్డు మెంబర్ ముప్పిడి పెద్ద సాయిలు మనవరాలి తొట్టెల కార్యక్రమం శుక్రవారం జరిగింది ఈ కార్యక్రమానికి కల్హేర్ జెడ్పిటిసి నరసింహారెడ్డి, సిర్గాపూర్ జడ్పిటిసి రాఘవరెడ్డి ,పార్టీ అధ్యక్షులు రామ్ సింగ్ సర్పంచ్ కిష్టారెడ్డి హాజరయ్యారు. అనంతరం అదే గ్రామానికి చెందిన చాకలి కిష్టయ్య కూతురు పుట్టు వెంట్రుకల కేశఖండన కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అలీఖాన్ పల్లి బిఆర్ఎస్ అధ్యక్షులు నారాయణ,ఉపసర్పంచ్ తనయుడు రాజు, ముప్పిడి సాయిలు, ఇస్మాయిల్ పటేల్, నరసింహులు, సత్తయ్య కుమ్మరి లక్ష్మయ్య, డాక్టర్ ప్రవీణ్, కూలి సురేష్ , కోరుడు చిన్న సాయిలు, ముప్పిడి శేఖర్ పాల్గొన్నారు,

అంబేద్కర్ విగ్రహానికి ముసుగు తొలగించినా బాధ్యులపై చర్యలేవి?

- అంబేద్కర్ సేవ సమితి అధ్యక్షులు కొండాపురం జగన్

నవతెలంగాణ-సంగారెడ్డి

అంబేద్కర్ విగ్రహానికి ముసుగు తొలగించినా బాధ్యులపై చర్యలేవి అని అంబేద్కర్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు కొండాపురం జగన్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం సంగారెడ్డిలో అంబేద్కర్ విగ్రహాన్ని ముసుగేసి అవమానపరిచిన విషయంలో జాతీయ ఎస్సీ కమిషన్కు ఫిర్యాదు చేయగా తక్షణమే స్పందించిన జిల్లా యంత్రాంగం ముసుగును తొలగించారు. కానీ దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రాళ్లకత్వ మత్స్యసంఘం అధ్యక్షులుగా ఆది నర్సింలు

నవ తెలంగాణ -జిన్నారం

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం రాళ్లకత్వ గ్రామ నూతన మత్స సహకార సంఘం అధ్యక్షులుగా ఆది నర్సింలు ఎన్నికయ్యారు. జిన్నారం మండల పరిధిలోని రాళ్లకత్వ గ్రామంలో శుక్రవారం స్థానికంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆది నర్సింలు ,ఉపాధ్యక్షుడిగా ఆది బాలరాజ్, కార్యదర్శిగా చింత కృష్ణ, డైరెక్టర్లుగా శ్రీనివాస్, రామస్వామి, శేఖర్, గోపాల్ ,యశోద, పుణ్యమ్మ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మత్స్య సహకార సంఘం అధికారులు నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఆది నర్సింలు మాట్లాడుతూ తన పై నమ్మకం తో మత్స్య పరిశ్రమ సహకార సంఘం అధ్యక్షులు ఏనుకున్న రాలకత్వ గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలను పరామర్శించిన జడ్పిటిసి నరసింహారెడ్డి

నవతెలంగాణ-కల్హేర్

కల్హేర్ మండలంలోని పోమ్య నాయక్ తండాలో గురువారం విద్యుత్ షాక్ కు గురై రామ్ సింగ్, రెడ్యానాయక్ మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కల్హేర్ జడ్పిటిసి నరసింహారెడ్డి శుక్రవారం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాలను పరామర్శించి ధైర్యాన్ని అందించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తనయుడు గణపతి, ఉప సర్పంచ్ భర్త జగన్, రామ్ సింగ్ నాయక్, వెంకట్ నాయక్ ,పాండు నాయక్, దేవల నాయక్, రూప్ సింగ్, కిషన్ ,సంగ్రామ్, కిషన్ జాదవ్ ,కేశవ నాయక్, రాముల నాయక్, తండవాసులు పాల్గొన్నారు,

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

కృష్ణాపూర్ రైతు వేదిక సమావేశంలో ఏడిఏ నూతన్ కుమార్

నవతెలంగాణ-కల్హేర్



రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి పంటలను సాగు చేసే విధానంలో వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు తీసుకొని అధిక దిగుబడును సాధించాలని నారాయణఖేడ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కే నూతన్ కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం కల్హేర్ మండలంలోని కృష్ణాపూర్ గ్రామ రైతు వేదికలో జరిగిన రైతుల సమావేశంలో మాట్లాడారు. పంటలను సాగు చేస్తున్న పద్ధతులలో మార్పులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ సలహాలు సూచనలు పాటిస్తూ రైతులు అధిక దిగుబడులు సాధించాలన్నారు. వరిలో యూరియా వాడకం తగ్గించాలని ఒక ఎకరాకు వేసిన ప్రతిసారి 25 కేజీలు మాత్రమే వాడాలని తెలిపారు. వరి కోసిన తర్వాత వరి కొయ్యలను కాల్చరాదని దానివలన వాతావరణ కాలుష్యం నేల కాలుష్యం భూమి పొరలు ఉండే జీవరాసులు చనిపోవడం భూమి పొర దాని నిర్దేశం మార్చుకోవటం ఇలాంటి మార్పులు సంభవిస్తాయన్నారు. కాబట్టి వరి కొయ్యలను కాల్చకుండా రోటవేటర్ తో భూమిలోనే కలియ దున్నాలన్నారు. అలా చేయడం వలన భూమిలో సారం పెరిగి పోషకాలు అందుబాటులోకి రావడం వలన దిగుబడులు పెరగడం జరుగుతుందన్నారు. రైతులు పురుగులమందు వాడకంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, మూడు నాలుగు రకాల మందులను అస్సలు వాడకూడదని తెలియజేశారు. శుక్రవారం ప్రపంచ జల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అందరూ ప్రతి నీటి బొట్టును జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. నీరు లేనిదే జీవ జలరాశులు అంతరించిపోతాయని భూగర్భ జలాలను కాపాడుకోవాలని ప్రతి ఒక్కరు నీటిని సంరక్షించుకోవాలని ఆలోచించారు. అనంతరం గ్రామ శివారులో వరి పంటలను నూతన కుమార్ వ్యవసాయ విస్తరణాధికారి కృష్ణవేణి తో కలిసి పరిశీలించారు. ఈ సమావేశంలో కలేర్ మండల జడ్పిటిసి నరసింహారెడ్డి,జిల్లా కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ అలీ, తాజా మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ వీరయ్య, మాజీ ఉపసర్పంచ్, రైతులు, పాల్గొన్నారు.

అంత్యక్రియలకు యువనేత ఆర్థిక సాయం

నవతెలంగాణ - ఐడీఏ బొల్లారం



బొల్లారం మున్సిపాలిటీ పరిధి లోని జ్యోతి నగర్‌లో నివాసముండే శ్రీకాకుళం వాసి నాగరాజు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ యువనాయకులు వి.ప్రవీణ్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం ఏడు వేల రూపాయల(7,000/-) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో అండగా నిలిచిన యువ నేతకు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శేఖర్, శ్రీను, కిరణ్, ప్రవీణ్, గున్న రావు, రామారావు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పెంచాలి

నారాయణఖేడ్ లో పరిశ్రమలు స్థాపించాలి

సెమినార్ లో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు అతిమెల మాణిక్



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నారాయణఖేడ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు సవాళ్లు అనే అంశంపై స్థానిక వెంకటేశ్వర ఐటిఐ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్ కు ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు మాణిక్యం హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధరల కనుగుణంగా స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించాలని నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఐటిఐ చేస్తున్న విద్యార్థులకు కోర్స్ అయిపోయిన వెంటనే స్థానిక పరిశ్రమలలో అప్రెంటిస్, ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో విద్యార్థులను ఐక్యం చేసి విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కే సతీష్ ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రకాంత్, బాలాజీ, చంద్రశేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు

ఐటిఐ చదివిన విద్యార్థులకు



పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్. రమేష్
- ఘనంగా ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి డివిజన్ మహాసభ

నవతెలంగాణ-సంగారెడ్డి

పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్. రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటిఐ చదివిన విద్యార్థులకు జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలన్నారు. శుక్రవారం

ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి డివిజన్ మహాసభ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్. రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ సమరశీల పోరాటాలు చేస్తుందని అన్నారు. ఐటిఐ కళాశాలకు ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులను ఐక్యం చేసి విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలపై పోరాటాలు చేయాలని మహాసభ తీర్మానం చేసింది. అనంతరం ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి డివిజన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షులుగా శ్రీనివాస్, కార్యదర్శిగా రవి కిరణ్ గౌడ్, ఉపాధ్యక్షులుగా తుకారం, కార్తిక్, సహాయ కార్యదర్శిగా విక్టోరియా, కమిటీ సభ్యులుగా స్వప్న, మనీలా, లక్ష్మి, శ్రీకాంత్, ప్రశాంత్, రజినీకాంత్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ కన్వీనర్ వాణి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ నిర్వీర్యం తగదు

- 15 రోజు లోపల ఉపాధి బకాయిలు ఇవ్వాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్

నవతెలంగాణ-కొండాపూర్

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కొండాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో చేర్ల గోప్లారం, తేర్పోల్ గ్రామాల ఉపాధి హామీ పని ప్రదేశాలను పరిశీలించింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎం. నర్సిములు మాట్లాడుతూ.. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీని నిర్వీర్యం చేయడం కోసం శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నాయని, ఉపాధి హామీ నిర్వీర్యం అయితే పేదల నోటికాడి బుక్కలాక్కోవడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం పనిచేసిన 15 రోజుల్లో కూలి డబ్బులు ఇవ్వాలని చెబితే రెండు నెలలైనా ఎందుకు డబ్బులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పని ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీళ్లుకచ్చితంగా ఉంచాలని పని ప్రదేశంలో దెబ్బలు తగిలితే మట్టిని పూసుకోవాల్సి వస్తుందని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలీ 800/- రూపాయలకు పెంచాలని, సంవత్సరంలో 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో జియో ట్యాగింగ్ వ్యవస్థను రద్దు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో విజయరావు, రాములు, బాలరాజు, రాజు గౌడ్, సాయి, జానయ్య, రత్నయ్య, అనిత, శామమ్మ, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానోత్సవం

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి పట్టణంలోని శాంతి నగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో శుక్రవారం 1వ తరగతి నుండి 4వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అచీవ్మెంట్ అవార్డుల పురస్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమ ప్రారంభంలో సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఈ.కరుణాకర్ రెడ్డి , వైస్ ప్రిన్సిపాల్ ఈ.అరుణా రెడ్డి , అకాడమిక్ డైరెక్టర్ ఈ.విజయ కుమార్ రెడ్డి సరస్వతీ మాత చిత్ర పటం ముందు జ్యోతి ప్రజ్వలన గావించి పటాన్ని పూలమాలతో అలంకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉదయం నిద్ర లేచినప్పటి నుండి రాత్రి నిద్ర పోయేవరకు ఏ పనినైనా బాధ్యతగా చేపట్టి గట్టి ప్రయత్నంతో కృషి చేస్తే సాధ్యం కానిదంటూ ఉండదని అన్నారు. చదువులో, ఆటల పోటీల్లో, క్రమశిక్షణలో సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైన వాటిలో చురుగ్గా పాల్గొని, వారి ప్రతిభాపాటవాలను కనబరిచిన విద్యార్థిని, విద్యార్థుల నైపుణ్యాలను ఇందులో తీసుకుని వ్యక్తిగతంగా అచీవ్మెంట్ అవార్డులు ప్రధానం చేస్తామని తెలిపారు. ప్రోత్సాహించడం వల్ల చదువులో కాకుండా విద్యార్థులు అన్నిరంగాల్లో చురుగ్గా పాల్గొని ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

నవ తెలంగాణ -కొండాపూర్

కొండాపూర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో జ్యోతిలక్ష్మి పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ.. వచ్చే వేసవిలో మండలంలోని అన్ని గ్రామాలలో నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఎలక్షన్ కోడ్ ఎక్కడా ఉల్లంఘించకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య నిర్వాహణ ప్రతిరోజు చేయాలన్నారు. నర్సరీలలో మొక్కలను రక్షించాలన్నారు. .ఈ కార్యక్రమంలోమండలంలోని



గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలలో శ్రీమంతాలు, అన్నప్రాసనలు

నవ తెలంగాణ- నిజాంపేట



మండల పరిధిలోని కల్వకుంట 1వ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు శ్రీమంతాలు, అన్న ప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. పోషణ దివస్ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు బాలింతలకు ఎటువంటి ఆహారం ఆరోగ్యం పరీక్షలు చేసుకోవాలో చిరుధాన్యాల గురించి తెలియజేశారు. గుడి కందుల రమ్యకుశ్రీమంతామ్, భాష విగ్నేష్‌కు అన్నప్రాసన, తల్లి దేవలక్ష్మి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ డి. పద్మ, పర్జాన, లలిత, అంగుర, గర్భవతులు భత్తుల రేఖ, కాకెల్లి వసంత, చింతల కావ్య, బత్తుల మనోష, ఆయా జి.సుగుణ బాలింతలు రంగా అఖిల, కారేళ్లి ప్రేమలత, బోనాల శిరీష, బొడుగే రేణుక, తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్ గీతా విద్యార్థుల వినూత్న ప్రదర్శన

నవతెలంగాణ-మనోహరాబాద్



అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా తూప్రాన్ గీతా స్కూల్ ఎనిమిదవ తరగతి విద్యార్థినులు నీటిని సంరక్షించాలనే సందేశాన్నిస్తూ వినూత్న ప్రదర్శన చేపట్టారు. నీరు లేనిదే మనం లేము...జలం లేనిదే జగం లేదు...పొదుపు చేయకపోతే నీరు...మిగులుతుంది కన్నీరు...అంటూ నీటిని పొదుపు చేస్తే దేశమంతా సుభిక్షంగా ఉంటుందని తెలియజేస్తూ భారత మాతను జలంతో అభిషేకిస్తున్నట్లుగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్ పర్సన్ పి.ఉష, డైరెక్టర్లు రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్త, ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకటకృష్ణారావు, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ప్రేంరాజ్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

భయాందోళనలో ప్రజలు
పట్టించుకోని విద్యుత్ అధికారులు

నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్, తూప్రాన్ రోడ్డులో గల మాధవి నర్సింగ్ హెూమ్ పక్కన గల విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు ఇండ్ల మధ్యనే జనాలు సంచరించే ప్రదేశంలో ఉండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం విద్యుత్ అధికారులు ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ కంచెను సైతం ఏర్పాటు చేయక పోవడం వల్ల ఆ ట్రాన్స్ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ఈ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని పలువురు



ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఈ ట్రాన్స్ఫార్మర్లను జనసంచారం లేని ప్రదేశంలోకి మార్చాలని విద్యుత్



శాఖ అధికారులకు పలువురు మొరపెట్టు కుంటున్నారు.

ప్రమాదకరంగా పాత బావులు

గ్రామానికి ఆనుకొని ఉన్న బావులు
వెంటనే పూడ్చాలని గ్రామస్తులు వేడుకోలు

నవ తెలంగాణ.- నిజాంపేట్

మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో పాత బావులు ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. ఈ మేరకు నస్కల్ గ్రామానికి చేరుకోవడంతో పాత బావి దర్శనమిస్తాది. రోడ్డు పక్కనే ఉన్న ఈ పెద్దబావి వల్ల వచ్చిపోయే వాహనాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. గ్రామానికి రాంపూర్ రోడ్ వెంబడి మరో పాడుబడిన బావి మూలమలుపు ప్రాంతంలో ప్రమాదకరంగా ఉంది. ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే కంట్రోల్ కాక అదుపుతప్పి ఆ బావిలో పడే అవకాశం ఉన్నది. అదేవిధంగా గ్రామంలోని చర్చి ఏరియాలో గాజు బావి కూడా ప్రమాదకరంగా ఉన్నది పశు వులకు చిన్నపిల్లలకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. మరొక్క గాజు బావి ఇళ్లకు ఆనుకొని ఉన్నది.



ఇందులో కుక్కలు పందులు కోళ్లు పడి చనిపోయి వాటి దుర్వాసన ఇళ్లల్లోకి వ్యాపించి శ్వాస తీసుకోలేని స్థితిలో ఉంటుంది. ఈ నెలలో చిన్నపిల్లలు స్కూల్లు, హాస్టల్లో నుంచి ఇళ్లల్లోకి చేరుకుంటారు. కాబట్టి ఆడుతూ పాడుతూ వెళ్లే క్రమంలో ప్రమాదాలు



జరిగే అవకాశం ఉంది కాబట్టి సంబంధిత అధికారులు ఈ పాడుబడిన బావులు సందర్శించి పూడ్చే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

నిజాంపేట మండల సమైక్య సమావేశం



నవతెలంగాణ - నిజాంపేట

గ్రామ సంఘం అధ్యక్షురాల్ల ఆధ్వర్యంలో సమైక్య సమావేశాన్ని ఓబీల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఏపిఎం రాములు మాట్లాడుతూ ప్రతి నెల 22 తేదీన మండల సమైక్య సమావేశంను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామం నుంచి అధ్యక్షులు హాజరవుతారన్నారు. గ్రామ సమైక్య సంఘంలో ఏమైనా సమస్యలు ఉంటే తీర్మానాలు చేసుకొని మండల సమైక్య సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. మహిళా గ్రూపులలో ఏమైనా ఆర్థిక ఇబ్బందులు ఉన్నా చర్చించి తీర్మానాలు చేసి జిల్లా సమావేశాలకు పంపడం జరుగుతుందన్నారు. అన్ని గ్రామ సంఘాలు ఏ గ్రేడు బి గ్రేడు ఉండాలని గ్రామ సమైక్య సంఘాలకు సూచించారు . మహిళలు తీసుకున్న రుణాలను బ్యాంకులలో సమయానికి కడుతున్నారా లేదా బ్యాంకు అధికారులకు జవాబుదారీ తనంగా ఉండాలని సూచించారు. సి, డి, ఎఫ్ గ్రేడులు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ గ్రేడ్లు వచ్చిన వారికి గౌరవ వేతనం రాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి స్వప్న, కోశాధికారి రేవతి, ఉపాధ్యక్షురాలు రేణుక, గ్రామ సంఘం అధ్యక్షులు శ్వేత, సావిత్రి, సీసీలు, అకౌంటెంట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సరైన పద్ధతిలో నీటిని వాడకమే నీటి సంరక్షణ

డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సింహారెడ్డి



నవ తెలంగాణ-మెదక్ టౌన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ సింహారెడ్డి మాట్లాడుతూ 'నీటిని సరైన పద్ధతిలో వాడినట్లయితే దానిని సంరక్షించినట్లే అవుతుందన్నారు. మరొక అతిథి ఐక్యూ ఎ సి కోఆర్డినేటర్ డా ఎస్ తిరుమల రెడ్డి మాట్లాడుతూ నీటి కాలుష్యం చెందించడం ద్వారా ఆ నీటిని తాగినప్పుడు మనలోనికి వివిధ రకాలైన హానికరమైన రసాయనిక పదార్థాలు చేరి జన్యుపరంగా మార్పులు వస్తాయన్నారు. కాబట్టి ఉన్న కాస్త మంచి నీటిని సరైన పద్ధతిలో వినియోగించుకొని, ఎటువంటి నీటి కాలుష్యం చెందకుండా కాపాడుకోవాలని విద్యార్థులకు నీటి వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగం ఏ. వేణుగోపాల రావు, వృక్షశాస్త్ర విభాగ ఉపన్యాసకులు మురళి, వర్ధెల్లి, డా బీ రాజు, సుధారాణి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా శ్రీకాంత్ గౌడ్

నవతెలంగాణ-చిలిపి చేడ్



చిలిపిచెడ్ బీజేపీ మండల అధ్యక్షునిగా రామగొని శ్రీకాంత్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికను నిర్వహించారు. మండలంలో ఇప్పటి వరకు ప్రధాన కార్యదర్శిగా ఉండి కార్యకర్తలకు అండగా నిలిచి అన్నింటికీ ముందుగా నిలిచి పేద బడుగు, బలహీన వర్గాలకు ముందున్న నాయకుడిగా మంచి పేరుంది. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తానన్నారు. పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతిక్షణం పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అజ్జమారి మాజీ సర్పంచ్ నాగేష్ , యాదగిరి, రమేష్ నాయక్, వెంకటేశం ,పాండురంగారెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖాన మెడికల్ ఆఫీసర్‌గా ప్రతిమ

నవతెలంగాణ-చిలిపిచెడ్



చిలిపిచెడ్ మండల కేంద్రంలోని పల్లె దావఖానాకు మెడికల్ ఆఫీసర్‌గా ప్రతిమ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సృజన చిట్కుల్‌కు బదిలీపై వెళ్లగా, నూతనంగా వచ్చిన ప్రతిమ బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టాఫ్ నర్స్ ఉద్యోగాలలో సెలక్షన్ అయి ఇక్కడికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన పల్లె దవఖాన మెడికల్ ఆఫీసర్ ప్రతిమ మాట్లాడుతూ ఎప్పటికీ అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు తీరుసానన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన జెడ్పీ వైస్ చైర్మన్

నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి, పందిల్ల గ్రామాలలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను శుక్రవారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, బి అర్ ఎస్ మండల అధ్యక్షుడు గంగం మధుసూధన్ రెడ్డి పరామర్శించారు. గూళ్ల గట్టయ్య, తాటికొండ గురువారెడ్డి బ్రదర్స్, వడ్డెర జెండర్, పోట్లపల్లి మాజీ ఉపసర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించారు. మండల అధ్యక్షుడు గంగం మధుసూదన్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎడబోయిని తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అలుమల్ల ప్రభాకర్ రెడ్డి, పందిల్ల మాజీ సర్పంచ్ తోడేటి రమేష్ , చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు..

జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల్లో తనిఖీలు పక్కాగా చేపట్టాలి

హవేలీ ఘనాపూర్ మండలంలో విస్తృత తనిఖీలు రిజిస్టర్లు పరిశీలన
మెదక్ జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి రాహుల్ రాజ్

నవతెలంగాణ-హవేలి ఘనపూర్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బోర్డర్ చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీలు పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హవేలి ఘనపూర్ మండలంలోని పోచమ్మ రాల్ వద్ద ఏర్పాటు చేసిన జిల్లా బార్డర్ చెక్ పోస్ట్‌ను ఆర్డీవో రమాదేవి, తహశీల్దార్‌తో కలసి ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా జిల్లా కలెక్టర్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాటిక్ సర్వే లెన్స్ బృందాలకు దిశా నిర్దేశం, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు నగదు, బంగారం, ఇతరత్రా కానుకల పంపిణీ చేసే అవకాశం ఉన్నందున ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. తనిఖీల ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఫ్లయింగ్‌స్క్వాడ్, స్టాటిస్టికల్ అకౌంటింగ్, వీడియో సర్వేలెన్స్, వ్యయ పరిశీలకుల బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు లేకుండా భారీ ఎత్తున నగదు, బంగారం వంటివి తరలిస్తే వెంటనే సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. సీజ్ చేసిన వస్తువులకు వివరాలతో కూడిన రశీదులను అందజేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమాదేవి, తహశీల్దార్ నారాయణ, హవేలీ ఘనపూర్ ఏఎస్‌ఐ సమీఉద్దీన్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వేసవిలో వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

వేసవిలో వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని, వన్యప్రాణులకు వేసవిలో ఆహారం త్రాగునీరు అందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని పోచారం ప్రాజెక్టు పోచారం వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పోచారం అరణ్యంలో 4.5 కిలో మీటర్లు సఫారీ వాహనంలో అటవీ ప్రాంతం తిరిగి జింకల ప్రత్యుత్పత్తి కేంద్రంను జింకలని, నెమళ్ళు, మనుబోతులు, పక్షులను, ఇతర అటవీ జంతువులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని, జంతువులకు ఆహారం, త్రాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. వన విజ్ఞాన కేంద్రం ఏర్పాటు, అటవీ విస్తీర్ణం, సందర్శకుల సమయ పాలన గురించి అటవీ అధికారులను అడిగి



తెలుసుకున్నారు. అటవీ జంతువులకు త్రాగు నీరు, ఆహారం, రక్షణ ఏ విధంగా ఇస్తారని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, హవేలీ ఘనపూర్ తహసిల్దార్



నారాయణ, అటవీ సెక్షన్ అధికారి శ్రావణ్ కుమార్, బీట్ ఆఫీసర్ ప్రసాద్ గౌడ్, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండరు

రైతులకు అవగాహన కల్పించేది ఎవరు....?
విధులకు హాజరు కాని అధికారులు ఎంతమంది..?
సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ విశ్వంబర స్వామి ఫైర్

నవతెలంగాణ-చిలిపిచెడ్

వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండరని రైతులకు అవగాహన కల్పించేది ఎవరని చిలిపిచెడ్ మండల వైస్ ఎంపీపీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు మండిపడ్డారు. శుక్రవారం ఎంపీపీ వినోద అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంబంధిత అధికారులు సమస్యలపై వాదించారు. బస్సులు వస్తే రెండు పోతే రెండు



ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని నర్సాపూర్ సంబంధిత అధికారి మధుసూదన్ రెడ్డిని వివరణ కోరారు. త్వరలోనే ఆ సమస్య తీరుస్తామని ఆయన తెలిపారు. చిలిపిచెడ్ మండల కేంద్రంలో అంగన్వాడి కేంద్రం లేక ఇబ్బంది పడుతున్నామని అంగన్వాడి సూపర్వైజర్ సంతోష్ మాత అన్నారు. గత ఆరు నెలల నుంచి పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని గ్రామాలలో పారిశుద్ధ్య పనులు చేయడానికి ఎవరు ముందుకు రావడంలేదని ఎంపీవో శరత్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్, కో ఆప్షన్ మెంబర్ షఫీ, ఏపీఓ దుద్యాల శ్యామ్, పిఆర్ ఏ మధుబాబు, ఎంపీఓ శరత్ కుమార్ రెడ్డి, అయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డి అభ్యర్థిత్వంపై బీఆర్ఎస్ నాయకుల హర్షం

నవ తెలంగాణ-నర్సాపూర్

మెదక్ పార్లమెంట్ నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డికి టికెట్ కేటాయించడం పట్ల బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నసీముద్దీన్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భోగ చంద్రశేఖర్‌లు శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే సునీత రెడ్డి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడారు వెంకట్రామిరెడ్డి గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు అదనపు కలెక్టర్‌గా సిద్దిపేట జిల్లాకు కలెక్టర్‌గా పని చేసి ఈ ప్రాంతంపై మంచి పట్టు ఉందన్నారు. అలాంటి వ్యక్తికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ సీఎం కేసీఆర్ మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి బిఆర్ఎస్ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసేందుకు టికెట్ కేటాయించడం సంతోషించదగ్గ విషయమన్నారు .కాంగ్రెస్ బిజెపి పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా మెదక్ ఎంపీగా బీఆర్ఎస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి నర్సాపూర్ మండలం నుంచి భారీ



మెజారిటీ అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్, సూరారం నరసింహులు, కుమ్మరి నాగేష్, ఆంజనేయులు గౌడ్, జ్ఞానేశ్వర్, బాల్ రెడ్డి, రింగుల ప్రసాద్, వెంకటేష్, నాగరాజు గౌడ్ ,మురళి గౌడ్ తదితరులు ఉన్నారు.

బివిఆర్ఐటి ఆధ్వర్యంలో ఘనంగా వరల్డ్ వాటర్ డే

నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివి రాజు ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్‌కు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు శుక్రవారం ఘనంగా వరల్డ్ వాటర్ డేను నిర్వహించారు. అనంతరం మండల పరిధిలోని రామచంద్రాపూర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వరల్డ్ వాటర్ డే సందర్భంగా బివి రాజు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు చెట్ల సంరక్షణ, నీటి పొదుపు పై అవగాహన కల్పించారు. వరల్డ్ వాటర్ డే సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించిన సివిల్ ఇంజనీర్ విద్యార్థులను కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దుబే, మేనేజర్ బాపిరాజులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీర్ విభాగాధిపతి కృష్ణారావు, అధ్యాపకులు డాక్టర్ విజయ గౌరీ, రూప దేవి, తదితరులు పాల్గొన్నారు.



రైతులు వరిపంటపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కోహెడ



రైతులు వరిపంటకు ఎలాంటి చీడపురుగులు, కాండం తొలుచు పురుగులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని వరికోలు గ్రామంలో వరి పంట పొలాలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరిలో కాండం తొలుచు పురుగు, మెడవిరుపు తెగులు ఉధృతి గమనించినట్లు తెలిపారు. నివారణకు రైతులు గట్ల వెంబడి కలుపు మొక్కలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. ఉంది..

మొక్కలకు నీరు పోసిన కమిషనర్

నవ తెలంగాణ - సిద్దిపేట : హరిత శుక్రవారంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి రంగనాయక సాగర్ వద్ద గల నర్సరీ లో మొక్కలకు నీళు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద గల మొక్కలకు నీరు పోసి సంరక్షించాలని కోరారు. వేసవి కాలం మూలంగా చెట్లకు నీరు పట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నామినేటెడ్ పదవులకు పోటాపోటీ

నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న పిడికెడు పదవుల కోసం గంపెడు నేతలు పోటీ పడుతున్నారు. నియోజకవర్గంలోని 9 మండలాల్లో ఉన్న ముఖ్య నాయకులు నామినేటెడ్ పదవుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నేతృత్వంలో నామినేటెడ్ పదవులను భర్తీ చేయవలసి ఉంది. నామినేటెడ్ పదవుల భర్తీ నర్సారెడ్డికి తలనొప్పిగా మారింది.పార్టీ లో నామినేటెడ్ పదవుల కోసం పోటీ తీవ్రంగా ఉంది. పార్టీనే నమ్ముకుని ఉన్న సీనియర్లు తమకు నామినేటెడ్ పదవులను కేటాయించాలని పట్టుబడుతున్నారు.గజ్వేల్ నియోజకవర్గంలో మాజీ సీఎం కేసీఆర్ గెలుపొందగా కాంగ్రెస్ నుంచి పోటీచేసిన మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని మార్కెట్ కమిటీలు, దేవస్థానాల అభివృద్ధి పాలకవర్గాల నియామకం కోసం స్థానిక నాయకుల తో సమాలోచనలు జరుపుతున్నారు. గజ్వేల్ నియోజకవర్గం రాష్ట్రంలో కీలకంగా మారింది. మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గం కావడంతో అందరి దృష్టి నియోజకవర్గం పైనే వుంది. ప్రోటోకాల్ కోసం నామినేటెడ్ పదవులు కేటాయించి తమ వారిని ప్రజల్లోకి పంపాలని అధికార పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానికంగా ఉన్న నామినేటెడ్ పదవులను ముఖ్య నాయకులు చాలామంది ఆశిస్తుండడంతో స్థానిక నాయకుడు నర్సారెడ్డి ఆయా నాయకులతో సమాలోచనలు జరుపుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ వర్గాలు క్రియాశీలకంగా పాల్గొనడం కోసం అధిష్టానం తగిన సూచనలు చేస్తుండగా మరోవైపు నామినేటెడ్ పదవులను దక్కించుకోవడం కోసం స్థానిక నాయకులు పోటీ పడుతున్నారు. . సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను ప్రజల్లోకి పంపుతున్నారు. . గజ్వేల్, వంటిమామిడి, తూప్రాన్, కొండపాక, మార్కెట్ కమిటీ లతోపాటు నాచారం, కొండపోచమ్మ దేవస్థానాల పాలకమండళ్లు , నాలుగు ఆత్మ కమిటీ చైర్మన్ పదవులు ఉన్నాయి.చైర్మన్ పదవులను సొంతం చేసుకోవడం కోసం స్థానిక నాయకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ ఓసి జనరల్ కాగా ఒంటిమామిడి మార్కెట్ కమిటీ ఎస్సీలకు రిజర్వ్ అయింది. దీంతో ఆయా వర్గాల నుండి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం స్థానిక నాయకులు నాయిని యాదగిరి, గొల్లపల్లి నరేందర్ రెడ్డి, బయ్యారం మల్లారెడ్డి ప్రయత్నాలు చేస్తుండగా ఇటిక్యాల లక్మారెడ్డి కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ గా మోహన్, పోశయ్య మరి కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారు. వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ చైర్మన్ గా చేపూరు మోహన్ తో పాటు మరికొంతమంది ప్రయత్నం చేస్తుండగా కొండపోచమ్మ దేవాలయం తదితర నామినేటెడ్ పదవులకు ఇతరులు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి తోపాటు ములుగు, కొండపాక, గజ్వేల్, తూప్రాన్ ఉమ్మడి మండలానికి ఆత్మ కమిటీల చైర్మన్ పదవులు వున్నాయి.గ్రంధాలయ సంస్థ చైర్మన్ పదవి వర్గల్ మండలానికి చెందిన రంగారెడ్డి లేదా ముత్యాలు కు దక్కే అవకాశం ఉంది.కాంగ్రెస్ పార్టీలో ఈ ఇద్దరు నాయకులు కూడా నర్సారెడ్డికి అత్యంత సన్నిహితులు. గతంలో నియోజకవర్గ కేంద్రానికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చి జగదేవ్పూర్ మండలానికి వైస్ చైర్మన్ పదవి ఇచ్చేవారు.కాంగ్రెస్ నాయకత్వం ఎలాంటి మార్పులు చేస్తుందోనని నాయకులు ఎదురుచూస్తున్నారు.

శాలివాహన జయంతి వేడుకలు



నవ తెలంగాణ - సిద్దిపేట

కుమ్మర్ల ఆరాధ్య దైవం శాలివాహన చక్రవర్తి జయంతి సందర్భంగా కుమ్మర్ల సంఘం జిల్లా అధ్యక్షులు దరిపల్లి శ్రీను ఆయన చిత్ర పటానికి నివాళి అర్పించారు. శుక్రవారం నర్సాపురం చౌరస్తా దగ్గర శాలివాహన చక్రవర్తి జయంతి కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక పురుషుడుగాపేరు శాలివాహనునికే దక్కిందన్నారు. క్రైస్తవులు క్రీస్తుశకంగా పేర్కొంటుండగా హిందువులు శాలివాహన శకంగా పిలుచుకుంటున్నారన్నారు. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో ట్యాంక్ బండ్పై శాలివాహనుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, శాలివాహనుడు యుగపురుషుడన్నారు. ప్రభుత్వమే చక్రవర్తి జయంతిని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నార్లపురం తిరుపతి, ముడపల్లి భూమయ్య , జగదేవపూర్ మండల అధ్యక్షులు కనకయ్య శేఖర్, బాలు, బాల్ కిషన్, కుమ్మర శాలివాహన కుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ లో ఆర్యవైశ్య భవనం వద్ద శుక్రవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి భూమి పూజలు చేశారు. పురోహితులు చాడ నంద బాల శర్మ ఆధ్వర్యంలో హెూమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నేతి చిన్నరాజమౌళి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కులదైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని, గుడి నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. వాసవి మాత కరుణ కటాక్షంతో అందరూ బాగుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి నీలం మధు సాయం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం కోమటి బండకు చెందిన ఉబ్బని మల్లయ్య-భారతిలు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి ఇద్దరి బిడ్డలు మల్కాజ్గిరిలోని ప్రైవేట్ కళాశాలలో జి ఎన్ ఎం కోర్సును చదువుతున్నారు. వారికి ఫీజు కట్టడం చాలా ఇబ్బందిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు రూ10 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ రాష్ట్ర నాయకుడు గుంటుకు శ్రీనివాస్, గ్రామ మాజీ సర్పంచ్ తూం శేఖర్, తూం ప్రభాకర్,షేక్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పాఠశాల కమిటీల ఎన్నిక



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి, మర్కుక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షెక్‌లతీ సైదా, వెంకటేశం అధ్యక్షతన శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నికలు నిర్వహించారు. మర్కుక్ పాఠశాల చైర్మన్ గా పి.మౌనిక, పాములపర్తి పాఠశాల చైర్మన్ గా ధర్మారం కనకమ్మను ఎన్నుకున్నారు. ప్రతి తరగతి నుండి ముగ్గురు విద్యార్థుల తల్లులను సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ పదవీకాలం రెండు సంవత్సరాలు ఉంటుందని కమిటీ కన్వీనర్ వెంకటేశం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మర్కుక్ ఎంపీడీవో అఫ్జలోద్దీన్, తహశీల్దారు చంద్రశేఖర్ రావు,ఐకెపి ఎపీఎం కిరణ్‌లు హజరయ్యారు. కార్యక్రమంలో ఐకెపి సిసిలు రమేష్, కవిత, నాగరాజు, హరిచంద్, ఉపాధ్యాయులు యం. రమణారావు, వందన, నరహరి ప్రసాద్, నాగేశ్వర్ రావు, పద్మా రెడ్డి, విద్యాధర్ రెడ్డి, రమేశ్, సంతోష, రజని, సిద్ధయ్య, కష్ణ, మునీర్, శ్రీలత ,భ్రమరాంబ , తదితరులున్నారు.

మెదక్‌లో బీజేపీ విజయం ఖాయం



నవతెలంగాణ-మర్కుక్

మెదక్ పార్లమెంటు బిజెపి అభ్యర్థి దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునంద్ రావు భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని బిజెపి మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి అన్నారు.శుక్రవారం ఆయన మర్కుక్ లో మాట్లాడుతూ కేంద్రంలో ముచ్చటగా మూడోసారి బిజెపి అధికారంలోకి వస్తుందన్నారు.మర్కుక్ లో బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి బిజెపి నాయకులు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ సింగ్, తిరుపతి రెడ్డి, జిజెవైఎం అధ్యక్షులు మధు,నాయకులు దేవాదాసు,మహేందర్,కిషోర్ రెడ్డి, కష్ణ,తదితరులున్నారు.

24న స్పిరిచువాలిటీ మహెూత్సవం

నవ తెలంగాణ - సిద్దిపేట

24న బూరుగుపల్లి ఆశ్రమంలో సిద్దిపేట స్పిరిచువాలిటీ మహెూత్సవం నిర్వహిస్తున్నట్లు హర్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ సెంటర్ నిర్వాహకులు వడ్డేపల్లి నాగేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు ధ్యానంతో మొదలై మధ్యాహ్నం భోజనాలతో ముగుస్తుందని, మధ్యలో వివిధ సంస్థల నుండి వచ్చిన గురువుల ప్రసంగాలు, బ్రైటర్ మైండ్స్ అనే ప్రోగ్రాం ఉంటుందని తెలిపారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పోషక ఆహారాన్ని తీసుకోవాలి



నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్

గర్భిణీలు, బాలింతలు, పిల్లలు, కిశోర పిల్లలు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగావుండాలని సిడిపిఓ జయమ్మ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండలంలోని నాగారం గ్రామంలో అంగన్ వాడి సెంటర్ లో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ జయమ్మ మాట్లాడుతూ బాల బాలికల్లో రక్తహీనత లోపాన్ని నివారించడానికి ఆకుకూరలు, ఐరన్ చాలా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి అంగన్ వాడి కేంద్రంలో పోషక పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం పోషణ పక్షం 2024 ప్రతిపాదిత థీమ్ లు, పోషణ్ భీ, పడాయి భీ (పిబిపిబి) సాంప్రదాయ, ప్రాంతీయ, స్థానిక ఆహార పద్ధతులు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం చేపట్టామన్నారు, గర్భిణీల ఆరోగ్యం, శిశు, చిన్న పిల్లల ఆహార (ఐవైసిఎఫ్) ఆచరణలు పోషకాహార సూచికలను చేస్తున్నామన్నారు. ఆరోగ్యంగా ఉండడానికి చిరుధాన్యా లు ఎంతగానో ఉపయోగపడతాయని సూచించారు. ఆధునిక ప్రపంచంలో ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరు మంచి ఆహారానికి దూర మవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, పోషణ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ కిరణ్ , పొట్లపల్లి సెక్టార్ అంగన్ వాడి టీచర్, ఆయాలు, ఆశ కార్యకర్తలు, లబ్దిదారులు, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఖాజీపూర్ గ్రామస్తుల వినతి



నవ తెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

గ్రామబహిష్కరణకు గురైన ఖాజీపూర్ గ్రామస్తులు తమకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఖాజీపూర్ గ్రామస్తులు ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ అంగబలం, అధికార బలంతో ఓ సామాజిక వర్గాన్ని గ్రామ బహిష్కరణ చేసిన ఘటన దారుణం అన్నారు. సిద్దిపేట జిల్లా అక్బర్ పేట మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన కొందరు1994 సంవత్సరంలో 20 మంది సభ్యులతో మత్స్యకార సొసైటీ సంఘం ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీలో కొందరు మరణించగా నూతన సభ్యత్వానికి మరికొందరు దరఖాస్తులు పెట్టుకున్నారు. ఆ దరఖాస్తు చేసుకున్న కమ్యూనిటీ సభ్యులను బెదిరిస్తూ గ్రామంలో ఉన్న మిగతా రాజకీయ నాయకులు ఒకటయ్యారు. గ్రామంలో మత్స్యకార కమిటీలు వద్దని మత్స్యకార సొసైటీలు వుండరాదంటూ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి బెదిరించారు. కులవత్తి మీద ఆధారపడ్డ సొసైటీ సభ్యులతోపాటు ఆ కమ్యూనిటీకి చెందిన వాళ్లందరినీ గ్రామ బహిష్కరణ చేయాలని కొంతమంది రాజకీయ నాయకులు మిగతా వారికి హుకుంజారీచేశారు. నిత్యవసరసరుకులు, పాలు ఇవ్వొద్దంటూ వ్యాపారస్తులను బెదిరించారు. గ్రామ బహిష్కరణకు గురైన బాధిత కుటుంబాలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్ ఆరోపణల్లో నిజం లేదు



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలో ఉన్న స్థలం కబ్జాకు గురైందని కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలలో ఎటువంటి వాస్తవం లేదని అవన్నీ కేవలం నిరాధారమైన ఆరోపణలే అని పట్టాలు తీసుకున్న లబ్ధిదారులతోపాటు ఆరోపణలకు ఎదుర్కొంటున్న స్థానిక నాయకులు తెలిపారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక నాయకులు అధికారి అండదండలతో కబ్జా చేసి అమ్ముకున్నారని కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు. లబ్ధిదారులకు 2022 సంవత్సరంలో అప్పటి మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే హరీష్ రావు చేతుల మీదుగా అప్పటి ఎమ్మార్వో విజయసాగర్ ఆధ్వర్యంలోనే పట్టాలను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. తాము ఎవరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఎవరి వద్ద కొనుగోలు చేయలేదని ప్రభుత్వం నుంచి పొందామని లబ్ధిదారులు తెలిపారు. స్థానిక నాయకులు కేకే రావు తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ నిరాధార ఆరోపణలు చేస్తూ మనోవేదనకు గురి చేస్తున్నారని చట్టరీత్యా వారిపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పట్టాలు పంపిణీ చేసింది 19 సర్వే నెంబర్ అయితే 21 సర్వే నెంబర్లు కబ్జా చేశారని ఆరోపించడం సరైంది కాదని అన్నారు. 19 సర్వే నెంబర్లు కూడా ఎటువంటి కబ్జాలు చేయలేదని ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను మాత్రమే పంపిణీ చేశామని అన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా నూతన కమిటీ ఎన్నిక



నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

ఎలక్ట్రానిక్ మీడియా సిద్దిపేట జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అయిత శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాజబాబు, కార్యదర్శిగా మహిపాల్ రెడ్డి, కోశాధికారిగా నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా మల్లారెడ్డి, ఎల్లోహర్, జాయింట్ సెక్రటరీలుగా పర్శ రాములు, రాజు, గౌరవ సలహాదారులుగా వెంకన్న, మహేష్, యాదగిరి, కమిటీ సభ్యులుగా గణేష్, చందు, వెంకట్, అశోక్, సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలపై కృషి చేస్తామని తెలిపారు.

బాయేర్ మొక్కజొన్నతో రైతులకు మేలు



నవతెలంగాణ-కోహెడ

బాయేర్ మొక్కజొన్నతో రైతులకు మేలు చేకూరుతుందని కంపెనీ జిల్లా మెనేజర్ విక్రమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతుల పంట పొలాల వద్ద క్షేత్ర ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్నలో కొత్తరకం హైబ్రిడ్ డీకేసీ 9217 రకం చీడపీడలకు, గాలివానలకు, ప్రతికూల పరిస్థితులకు తట్టుకొని అధిక దిగుబడిని రైతులకు అందిస్తుందన్నారు. రైతులు బాయేర్ కంపెనీ మొక్కజొన్నను వాడి అధిక దిగుబడి పొంది ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంపత్, మండల ప్రతినిధి సంతోష్‌కుమార్, రైతులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొన్నం ప్రభాకర్



నవ తెలంగాణ - హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బత్తిని అనిత దేవేందర్‌ల కుమార్తె వివాహానికిహాజరై మంత్రి పొన్నం ప్రభాకర్ వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు కేడం లింగమూర్తి , హుస్నాబాద్ మండల అధ్యక్షుడు బంక చందు, అక్కన్నపేట మండల అధ్యక్షుడు జంగాపల్లి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి పుస్తె మట్టెలు అందజేత



నవతెలంగాణ -దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట 9వ వార్డుకు చెందిన కాజీపురం భవాని శంకర్ దంపతుల కుమార్తె కృష్ణవేణి వివాహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మామిడి మోహన్ రెడ్డి పుస్తె మట్టెలను అందజేశారు.శుక్రవారం మోహన్ రెడ్డి శంకర్ కుటుంబ సభ్యులకు పుస్తె మట్టలను అందజేశారు.పేద కుటుంబానికి చెందిన కృష్ణవేణి వివాహానికి చేయూతను అందించిన మామిడి మోహన్ రెడ్డికి కౌన్సిలర్ స్వామి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో 8 వ వార్డ్ కౌన్సిలర్ దుబ్బాక బాలకష్ణ గౌడ్,కోఆప్షన్ సభ్యులు ఆస స్వామి,బీఆర్ఎస్ నాయకులు పల్లె రామస్వామి గౌడ్,నందాల శ్రీకాంత్,గోనెపల్లి సంజీవరెడ్డి,వేముల మల్లేశంలు పాల్గొన్నారు.

బీఎస్పీకి రాజీనామా



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గుండారం గ్రామానికి చెందిన కరీంనగర్ జిల్లా బీఎస్పీ కార్యవర్గ సభ్యుడు పెద్దొల్ల శ్రీనివాస్ యాదవ్ బీఎస్పీ పార్టీకి రాజీనామ చేసినట్టు శుక్రవారం తెలిపారు.బీఎస్పీ పార్టీసిద్ధాంతాలను జాతీయ నాయకులు విస్మరించి మత తత్వ పార్టీకి వత్తాసు పలకడాన్ని వ్యతిరేకిస్తూ బీఎస్పీ నుండి వైదొలుగుతున్నట్టు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ



నవ తెలంగాణ- మిరుదొడ్డి

రంజాన్ పవిత్ర మాసం పురస్కరించుకుని ముస్లిం నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను డాక్టర్ మొహమ్మద్ సాహెబ్ హుస్సేన్ సాహెబ్ మండలంలోని సుమారు 70 మంది ముస్లిం కుటుంబాలకు అందజేశారు. మిరుదొడ్డి మండల కేంద్రముతో పాటు మండల పరిధిలోని గ్రామాల 70.మంది ముస్లిం సోదరులకు నిత్యావసర వస్తువులు బియ్యం తోపాటు మహిళలకు బట్టలను పంపిణి చేశారు. 30 రోజులపాటు ముస్లింలు కఠినమైన ఉపవాస దీక్ష చేపడతారని, ఉపవాస దీక్ష ముగిసే సమయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తారన్నారు. దుబ్బాక నియోజకవర్గం గౌరవ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్. హుస్సేన్.మతీన్.షరీఫ్ తో పాటు మిరుదొడ్డి జామా మజీద్ కమిటీ సభ్యులందరూ పాల్గొన్నారు.

గ్రామ బహిష్కరణ సరికాదు

బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సరోజ

నవ తెలంగాణ మిరు దొడ్డి

అక్బర్ పేట- భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామాన్ని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సరోజ, జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం సందర్శించారు. గ్రామంలోని పెద్ద చెరువు పై తలెత్తిన వివాదంలో ముదిరాజ్ కులస్తులను గ్రామస్తులు బహిష్కరించడం సరైంది కాదన్నారు. పెద్ద చెరువులోని చేపలను గ్రామ డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో చేపలను విక్రయించి గ్రామ అభివద్ధికి ఉపయోగించడం జరుగుతుందన్నారు, విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కషి చేస్తామన్నారు. ముదిరాజ్ కులస్తుల బహిష్కరణను ఉపసంహరించుకోవాలని గ్రామస్తులకు అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ పి ఓ, తహసిల్దార్ జయంత్, స్పెషల్ ఆఫీసర్ వీరేష్, ఎంపీడీవో గణేష్ రెడ్డి పాల్గొన్నారు.

మెపా రాష్ట్ర కార్యదర్శిగా దాసరి శాంత కుమారి



నవ తెలంగాణ - సిద్దిపేట

హైదరాబాద్‌లో జరిగిన ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రం (ఎంఈపిఏ, మెపా) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సిద్దిపేటకు చెందిన దాసరి శాంత కుమారి ముదిరాజ్ ను మెపా యూనియన్ కి రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు.సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బోట్ల పల్లి సంజీవన్ కుమార్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ జగన్ మోహన్ ముదిరాజ్ లు తనకు నియామక పత్రం అందించినట్లు ఆమె తెలిపారు. సిద్దిపేట జిల్లా మెపా అధ్యక్షులు పిట్ల అంజనేయులు, ప్రధాన కార్యదర్శి నాయిని కష్ణ ముదిరాజ్ లకు కతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్ ల రిజర్వేషన్ సాధన కోసం కషి చేస్తానని, అందుకోసం ఐక్య ఉద్యమాలు చేస్తామన్నారు.

మహనీయుల జన్మదిన ఉత్సవాలు జయప్రదం చేయాలి

డి.ఎస్.పి జిల్లా అధ్యక్షులు రవిబాబు



నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 11న పీడిత ప్రజల విముక్తి ప్రదాతలు అయిన మహాత్మ జ్యోతిరావుపూలే, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, కాన్సిరాముల జన్మదిన ఉత్సవాలను పురస్కరించుకుని జరగబోయే బారి సభను జయప్రదం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కర్రోల్ల రవిబాబు మహారాజ్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడిత సమాజం నుండే విముక్తి ప్రదాతలని, జ్యోతిరావుపూలే, డాక్టర్ అంబేద్కర్, సాహు మహారాజ్, కాన్సీరాము లు వీరి సామాజిక, రాజకీయ యుద్ధం వలెనే నేడు 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు భారత రాజ్యాంగం ద్వారా హక్కుల పొంది బ్రతుకుతున్నారని అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 11న మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి రోజున వేలాది మందితో భారీ సభను ఏర్పాటు చేయడం జరుగుతోందని, అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, విద్యావంతులు, ప్రజాస్వామ్యవాదులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు అనిల్, యాదగిరి, శ్రీకాంత్, దీపక్, అంజి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటిలో దళిత మహిళలకు ప్రాధాన్యతివ్వాలి

డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి.



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ మహిళ సంఘాల అధ్వర్యంలో ఆదర్శ కమిటిల ద్వారా నడుపాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి అన్నారు.శుక్రవారం గజ్వేల్ మండలం దాచారం గ్రామంలో పాఠశాల విద్యార్థులతో కమిటిల ఏర్పాటు గురించి అభిప్రాయాలను సేకరించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 636 ప్రాథమిక,113 ప్రాథమికోన్నత, 227 ఉన్నత పాఠశాలలో జిల్లా పరిదిలో 976 అన్ని పాఠశాలలో అదర్శ అమ్మకమిటిల నిర్మాణంలో దళిత మహిళలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.గజ్వేల్ మండల పరిదిలో 29 ప్రాథమిక,13 ప్రాథమికోన్నత,12 ఉన్నత పాఠశాలలో నిర్మానమయ్యే అదర్శ కమిటిలో దళిత మహిళలకు ప్రధాన్యత ఇవ్వాలన్నారు. కమిటిలు నిర్వహించబొయో మౌలిక సదుపాయలు కల్పించడంలో,బాలికల కొసం మరుగుదొడ్ల నిర్మాణం లో,త్రాగునీటి సౌకర్యం కల్పించడంలో, తరగతి గదులలో విద్యుద్దీకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. పాఠశాలలను పారిశుధ్యంగా ఉంచడంలో,సొలార్ ప్యానెళ్ళ ఏర్పాటు లో భాగస్వామ్యం అయ్యేవిధంగా దళిత మహిళలకు ప్రాదాన్యతనిచ్చి దళిత పిల్లలు ఎక్కువగా చదివే ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ ఆ వర్గ మహిళలకు ఇవ్వడం సముచితంగా ఉంటుందన్నారు.

ఫ్రీజింగ్ చేసిన బ్యాంక్ అకౌంట్లను వెంటనే ఆక్టివ్ చేయాలి

నవతెలంగాణ-చేర్యాల

ఫ్రీజింగ్ చేసిన కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్లను వెంటనే ఆక్టివ్ చేయాలని ఏఐసీసీ ప్రెసిడెంట్ కమలాకర్ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫ్రీజింగ్ చేసిన కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్లను ఆక్టివ్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చేర్యాల మండల కేంద్రంలోని గాంధీ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా కమలాకర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను తన చెప్పు చేతుల్లో పెట్టుకొని దేశంలో కాంగ్రెస్ పార్టీని రాజకీయ కార్యకలాపాలు చేయకుండా ఇబ్బంది పెట్టే ఉద్దేశమే ఈ అకౌంట్ ఫ్రీజింగ్ ఉద్దేశమని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి కేవలం 16 శాతం మాత్రమే వచ్చినటువంటి డొనేషన్లను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకోకుండా చేసి కాంగ్రెస్ పార్టీని ఇబ్బంది పెట్టాలని బిజెపి పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ చేర్యాల పట్టణ అధ్యక్షులు మంచాల చిరంజీవులు,ఆగం రెడ్డి, కౌన్సిలర్లు చెవిటి లింగం,సందుల సురేష్,నాయకులు తుమ్మలపల్లి సంజీవులు, బందెల మహిపాల్ రెడ్డి, దాసరి శ్రీకాంత్, కాశెట్టి ఉపేందర్, నీలం సన్నీ, ప్రసాద్, గుస్క కృష్ణ, వినీత్, బాలరాజు, సాయి, రాకేష్, కంకచంద్రం, బాబు, రాజు,చంద్రమౌళి, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో లింగారెడ్డిపల్లి సేవాసమితి

నవతెలంగాణ- రాయపోల్

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం కోసం నిస్వార్థంగా సామాజిక ప్రజా సేవ చేయడమే పరమావధిగా సమాజంలో ప్రజా సేవ చేస్తున్న కొంతమంది ప్రజా సేవకులను ఆదర్శంగా తీసుకొని గ్రామములో కష్టాలలో ఉన్న నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా లింగారెడ్డిపల్లి సేవా సమితి యువత నడుం బిగించింది. సాటి మనిషికి సహాయం చేసి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. రాయపోల్ మండలంలోని లింగారెడ్డి పల్లి గ్రామంలో మచ్చ దుర్గవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.వీరిది నిరుపేద కుటుంబం కావడంతో లింగారెడ్డి పల్లి సేవా సమతి సభ్యులు పరామర్శించి పది వేల రూపాయల ఆర్థిక సహాయం, పదివేల రూపాయల విలువ గల నిత్యావసర సరుకులు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా లింగారెడ్డిపల్లి సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ పేద కుటుంబాలకు సేవ చేయడం ఎంతో అదృష్టమని ఎన్ని డబ్బులు సంపాదించడం ముఖ్యం కాదని ఎంత మందికి సహాయం చేసామన్నది ముఖ్యమన్నారు. .ఈ కార్యక్రమంలో లింగారెడ్డి పల్లి సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

టెండర్ బాకీల వసూళ్లలో జాప్యం

- గడువు దాటినా అధికారుల పట్టింపు లేదు
- నయా బాకీలు 47.11 లక్షలు
- పాత బాకీలు 20 లక్షల పైనే
- టీటీడీ షెటర్లు, కోరమిసాల బాకీలు అదనం
- నోటీసులు జారీ చేసినా ఫలితం లేదు
- శివ సదన్ షాపింగ్ షేటర్లకు టెండర్ల లేవి



నవ తెలంగాణ - కొమురవెల్లి

కోరమీసాల కొమురెల్లి మల్లన్న ఆలయంలో టెండర్ల బకాయిలు లక్షల్లో పేరుకుపోయాయి టెండర్ నిబంధనల ప్రకారం ఆలయానికి కాంట్రాక్టర్లు చెల్లించాల్సిన డబ్బులు గడువులోపు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. బాకీలు వసూలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గత ఏడాది జులై 9న నిర్వహించిన టెండర్లను ఒక సంవత్సర కాలానికి చేజిక్కించుకున్న కాంట్రాక్టర్లు టెండర్ నిబంధనల ప్రకారం ఆలయానికి వారం రోజుల్లో నే పూర్తి మొత్తం చెల్లించాలి. టెండర్‌దార్ల విజ్ఞప్తులమేరకు మూడు నెలల గడువు ఇచ్చి ఆలయ అధికారులు వెసులు బాటు కల్పించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఆలయానికి 47.11 లక్షలు బాకీ ఉన్నారు. ఇవే కాకుండా పాత బాకీలు మరో 20 లక్షల పైనే ఉన్నాయి. వీటిని వసూలు చేయడండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

వసూలు కావలసిన బకాయిలు లక్షల్లో

ఆలయంలో తలనీలా కాంట్రాక్టర్ నుండి రూ. 26 లక్షలు, వస్త్రములు ఒడి బియ్యం పసుపు సేకరణ రూ.12.25 లక్షలు,గుట్టపై ఉన్న ఎల్లమ్మ టెంపుల్ వద్ద కొబ్బరి కాయలు అమ్మే వాళ్ళు రూ. 6లక్షలు, కొబ్బరి ముక్కలు సేకరించుకునేవాళ్ళు రూ. 2.86 లక్షలు ఆలయానికి నికి బాకీ ఉన్నారు. గత సంవత్సర జాతర కోరమీసాల కాంట్రాక్టర్ ఇంకా సుమారు రూ. 1 లక్ష కు పైనే బాకీ ఉన్నాడు, దీనికి తోడు టిటిడి కళ్యాణ మండప ముందర ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ అద్దె బాకీలు 5 లక్షలకు పైగా వసూలు కాకుండా పెండింగ్లో ఉన్నాయి. ఇవి కాకుండా పాత బకాయిలు 2019, 2021 లోని కొబ్బరి కాయల టెండర్ డబ్బులు ఇద్దరి వ్యక్తుల నుండి 20 లక్షలకు పైగా వసూలు చేయకుండా వదిలేశారు. స్వామివారి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు నెలనెలా సరైన సమయానికి జీతభత్యాలు తీసుకున్నట్లుగా మల్లన్న ఆలయానికి రావలసిన టెండర్ డబ్బులను ఎందుకు వసూలు చేయట్లేదంటూ భక్తుల నుండి విమర్శలు వెలువెత్తుతున్నాయి.

షాపింగ్ షెటర్ల టెండర్లలేవి...

వైశ్య సత్రం ముందు నూతనంగా నిర్మించిన "శివ సదన్" దేవాలయ వసతి గృహం ఈసారి జాతరకు అందుబాటులోకి వచ్చింది. అందులో క్రింది భాగంలో వ్యాపార సముదాయానికి అనుకూలంగా 10 షెటర్ల నిర్మాణం చేపట్టారు. 10 షెటర్లకు ఆలయ అధికారులు సరైన సమయానికి టెండర్ పెడితే 10 లక్షల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతానికి ఆ షెటర్లను వసతి గృహ లెక్కన అద్దెలకు ఇస్తున్నారు ఆదివారం ఒక్కరోజే భక్తులు అద్దెకు తీసుకుంటారు దీంతో ఒక్క షెటర్ కు రూ 800ల ఆదాయం వస్తుంది . అధికారుల నిర్లక్ష్యంతో ఆలయ ఆదాయానికి భారీగానే గండి పడింది.

ఆలయ అధికారుల నిర్లక్ష్యమే
సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి



ఆలయ అధికారుల నిర్లక్ష్యం తోనే టెండర్ దార్లు డబ్బులు చెల్లించడం లేదనీ తెలుస్తోంది.వెంటనే టెండర్ దార్ల నుండి డబ్బులు వసూళ్లయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి

బకాయిలు వెంటనే వసూలు చేస్తాం
ఆలయ ఈవో బాలాజీ శర్మ



టెండర్ బాకీలు వెంటనే వసూలు చేస్తాము. ఇప్పటికే మూడు సార్లు నోటీసులు వెళ్లాయి. పాత బాకీల కోసం ఇద్దరి పై కోర్టులో కేసులు వేసాము. శివ సదన్ వసతి గృహాన్ని భక్తులకు అందుబాటులోకి తెచ్చాము. షాపింగ్ షెటర్లకు రెండు సార్లు టెండర్లు పిలిచినా వ్యాపారులు ముందుకు రాలేదు. వాటిని కట్టేటప్పుడే అటాచ్ బాత్రూంతో నిర్మించాం ప్రస్తుతానికి వసతి గృహం కింద అద్దె కు ఇస్తున్నాము

దండం పెడతా ... వంటేరు కాంగ్రెస్‌లోకి రావద్దు

- మా పార్టీని భూస్థాపితం చేయవద్దు
- సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

నవతెలంగాణ- గజ్వేల్



ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి కి దండం పెడతానని, కాంగ్రెస్ పార్టీలోకి రావద్దని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు చేతులు ఎత్తి దండం పెడతా కాంగ్రెస్ పార్టీలోకి వస్తే పార్టీ భూస్థాపితం అవుతుందని ఆయన అన్నారు. 2009, 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుండి పోటీ చేసి ఆ పార్టీని భూస్థాపితం చేశారని ఆయన విమర్శించారు. 2018లో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి పార్టీని నాశనం చేశారని ఆయన అన్నారు. ఆ తర్వాత బి ఆర్ ఎస్ పార్టీ లో చేరిన ఒంటేరు ప్రతాప్ రెడ్డి తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ పదవి తీసుకొని 2023 ఎన్నికల్లో టికెట్ ఆశించినప్పటికీ తిరిగి కేసీఆర్ పోటీ చేయడంతో టికెట్ దక్కలేదు అన్నారు. ఇక్కడ కూడా బిఆర్ఎస్ పార్టీ తెలంగాణలో నామరూపాలు లేకుండా పోతుందని ఆయన అన్నారు. మెదక్ టికెట్ ఆశించి భంగపడ్డ ప్రతాప్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ప్రయత్నం చేస్తున్నారని తాము అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. పార్టీ అధిష్టానం కు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమాచారం ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ప్రతాపరెడ్డిని పార్టీలోకి తీసుకోవద్దని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు ఆయన అన్నారు. ఆయన బతుకంతా కబ్జాల కాలమేనని ఆయన విమర్శించారు. మేడ్చల్, ములుగు, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భూకబ్జాలు చేశారని ఆయన ఆరోపించారు. అలాంటి నాయకుడు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే సహించేది లేదన్నారు. తూప్రాన్ మున్సిపల్ స్థానాన్ని కైవాసం చేసుకున్నామని, కొండపాక మండలం అధ్యక్ష పదవిని కైవసం చేసుకుంటామన్నారు. మిగతా మండల, మున్సిపల్ పై కూడా దృష్టి పెట్టినట్లు ఆయన అన్నారు.

వెంకట్రామిరెడ్డిని ఓడిస్తాం

మెదక్ పార్లమెంటు భారత రాష్ట్ర సమితి అభ్యర్థి ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిస్తామని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్వాసితుల శాపం వెంకటరామిరెడ్డికి తగులుతుందన్నారు. వారంతా సైనికులుగా పనిచేసే భారత రాష్ట్ర సమితి అభ్యర్థిని ఓడిస్తారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజు, రవీందర్ రెడ్డి, నక్క రాములు, కుమార్, అస్గర్, మోహన్, రమేష్ గౌడ్, శివారెడ్డి, సురేష్, భగవాన్ రెడ్డి, బాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-వర్గల్



మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం రోజున జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆసుపత్రిలోని ఫార్మసీ స్టోర్ పనితీరును గమనించారు. వైద్య విధానాలకు సంబందించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయించేలా ప్రజలను చైతన్యపరచాలని వైద్య బృందానికి సూచించారు. ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు వంద శాతం లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. మాతా శిశు సంక్షేమం గురించి క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ తనిఖీలలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు, మండల వైద్య అధికారిని డాక్టర్ హరిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం -జెడ్పీటీసీ

నవ తెలంగాణ - దుబ్బాక



త్వరలో జరగబోవు పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని జడ్పీటీసీ సభ్యుడు కడతాల రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ హయాంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతుందని, కేసీఆర్ హయాంలోనే సబ్బండ వర్గాలకు న్యాయం దక్కిందన్నారు. బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ వెంకటరామిరెడ్డి ని ప్రకటించిన సందర్భంగా శుక్రవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని బస్టాండ్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. అనంతరం వారు మాట్లాడుతూ, మెదక్ ఎంపీ గా వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని మాజీ సీఎం కేసీఆర్ కు బహుమతిగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు గుండెల్లి ఎల్లారెడ్డి,దుబ్బాక మండలాధ్యక్షులు బాణాల శ్రీనివాస్,సీనియర్ నాయకులు రొట్టె రాజమౌళి,కొత్త కిషన్ రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు ఇల్లందుల శ్రీనివాస్,బత్తుల స్వామి,దుబ్బాక బాలకృష్ణ గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు ఆస స్వామి, నాయకులు నారా గౌడ్, రాధామనోహర్ రెడ్డి,పడాల నరేష్,పర్సకృష్ణ,వేముల మల్లేశం గౌడ్,పలువురు పాల్గొన్నారు.

అకాల వర్షానికి నేలకొరిగిన మొక్కజొన్న

నవతెలంగాణ- రాయపోల్



ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంటలు నష్టం వాటిల్లింది. రాయపోల్ మండలం టెంకంపేట,మంతూర్ గ్రామాలలో కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న పంట నేలకొరిగింది. మంతూర్ గ్రామంలో బందారం సంతోష్, టెంకంపేట గ్రామంలో తిరుపతి కిషన్ వారికున్న వ్యవసాయ పొలంలో యాసంగిలో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఏపుగా ఎదిగిన పంటచేను తీరా మొక్కజొన్న కంకులు పెట్టి చేతికందే సమయంలో కురిసిన అకాల వర్షాలకి నేలకొరిగింది. ఆరు కాలం కష్టపడి పండించిన పంట చేతికివచ్చే సమయంలో నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పంట నష్టం పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ భూములు భవనాల పరిరక్షణ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - జగదేవపూర్

జగదేవపూర్ గ్రామంలో గల ప్రభుత్వ భూములు, భవనాల పరిరక్షణ కమిటీని శుక్రవారం గ్రామంలో గల మల్లికార్జున స్వామి దేవాలయ ఆవరణలో ఎన్నుకోవడం జరిగింది. కమిటీ కన్వీనర్ గా సయ్యద్ మునీర్ అధ్యక్షులుగా మారుతి వెంకట నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా దాచారం కనకయ్య, కాకాల రమేష్ ,మచ్చ నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా బింగి మల్లేశం, సంయుక్త కార్యదర్శులుగా కొంపెల్లి మహేష్, బింగి నర్సింలు, కోశాధికారిగా ఎండి జాంగిర్ ముఖ్య సలహాదారులుగా మచ్చ నర్సింలు దోమ నర్సింలు, రాచకొండ బాల నరసయ్య, కొత్త శ్రీనివాస్ రెడ్డి, సభ్యులుగా ఎండి ఖలీల్ కోనమైన గిరి, దాచారం బాల్ నరసయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో దినదినం ప్రభుత్వ భూములు కబ్జాకు ఉరి కావడం జరుగుతుందని వాటిని సంరక్షించేందుకు అదేవిధంగా ప్రభుత్వ భవనాలను కాపాడేందుకు ఈ కమిటీ పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వభూములను అస్తులను కాపాడడమే కమిటీ ముఖ్య ఉద్దేశం అన్నారు. గ్రామంలోని ప్రభుత్వ భూములను కాపాడుకుంటే రేపటి తరాల వారికి అమూల్యమైన సంపదను అందించిన వారమవుతామని తెలియజేశారు.

బంధం చెరువు సొసైటీ ఎన్నిక

నవతెలంగాణ-వర్గల్

మండలంలోని చౌదర్ పల్లి గ్రామంలోని బంధం చెరువు సొసైటీ ని శుక్రవారం రోజున ఎన్నుకున్నారు. సొసైటీ ఎన్నికలో భాగంగా చైర్మెన్ గా పడిగే రాజు, వైస్ ప్రెసిడెంట్ గా నర్సింలు, డైరెక్టర్లు గా రవి, అగయ్య, పోచయ్య వెంకటయ్య, మహేష్ నియమితులయ్యారు. వారికి గ్రామ స్పెషల్ ఆఫీసర్ రేఖ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికైన సొసైటీ సభ్యులు మాట్లాడుతూ. చెరువు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. ఈ ఎన్నికలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పత్తి సాగుపై శిక్షణ

నవతెలంగాణ-చేర్యాల



కృషి విజ్ఞాన కేంద్రం మెదక్, న్యూజివీడు సీడ్స్ సౌజన్యంతో చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం రైతులకు అధిక సాంద్రత పత్తి సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కీటక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఒక ఎకరా పత్తి సాగుకు ఆరు ప్యాకెట్లు పత్తి విత్తనాలు విత్తుకోవాలని వాటి మధ్య దూరం 90ౖ15 సెంటీమీటర్లు 90 సెంటీమీటర్లు వరుసల మధ్య 15 సెంటీమీటర్ మొక్కల మధ్య దూరం పద్ధతిలో విత్తినట్లయితే ఎకరానికి 29 600 మొక్కలు వస్తాయని, దిగుబడి ఎకరానికి 12 నుంచి 14 క్వింటాళ్ల వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఈ పద్ధతి ఎర్ర నేలలకు అనుకూలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ యాంత్రిక విభాగ శాస్త్రం ఉదయ్ కుమార్,సేద్య విభాగ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్. ప్రతాపరెడ్డి, న్యూజివీడు సంస్థ ప్రతినిధులు, వ్యవసాయ శాఖ చేర్యాల డివిజన్ మండల అధికారులు అఫ్రోజ్ ,నరేష్, రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు కల్యాణి, రైతులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల అభివృద్ధికి తోడ్పడాలి

- బాలవికాస సేవా సంస్థ కో-ఆర్డినేటర్ కనకరాజు

నవ తెలంగాణ -మిరుదొడ్డి

ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి భూగర్భ జలాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పడాలని బాలవికాస సేవా సంస్థ కోఆర్డినేటర్ కనకరాజు అన్నారు. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులచే బాలవికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నీటిని వృధా చేయడం ద్వారా రాబోయే రోజుల్లో దేశంలో నీటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం లేకపోలేదన్నారు. దేశంలో నీటి సమస్య పరిష్కారానికి సంఘీభావంగా బాలవికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్య పరచడం కోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. నీటి వధాను అరికట్టాలని విద్యార్థులచే మానవహారం నిర్వహించడంతో పాటు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జగన్మోహన్ రెడ్డి, బాలవికాస ప్రతినిధులు మల్లేశం, రాజు పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు భరోసా

- సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణ

నవతెలంగాణ -సిద్దిపేటరూరల్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు భరోసా కల్పిస్తుందని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండలంలోని గోపులపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. అనంతరం మండల అధ్యక్షుడు బర్మ రామచంద్రము అధ్యక్షతన గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా నిరుగొండ దేవయ్యను, గౌరవ అధ్యక్షులుగా రెబ్బల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు ఎదుళ్ల యాదయ్య, కార్యదర్శులుగా మల్లయ్య, పర్శు రాజు, గోకురు రాజు గార్లను ఎన్నుకున్నారు. హరికృష్ణ మాట్లాడుతూ గోపులపూర్ గ్రామంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలోకి రావడం ఆనందంగా ఉందన్నారు, భవిష్యత్తులో మరింత మందిని కూడా పార్టీలో చేర్పించడానికి నాయకులు కృషి చేయాలన్నారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఉచిత బస్సు, పేదవారికి ఉచిత కరెంటు, రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, టిఎస్పిఎస్సి ప్రక్షాళన, అన్ని కులాలకు కార్పొరేషన్ల ఏర్పాటు, కుల గణన లాంటి ఎన్నో నిర్ణయాలు ప్రభుత్వం వంద రోజుల లోపే చేసి, ప్రజల మన్నలను పొందిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంద పాండు, రాష్ట్ర సేవాదళ్ కన్వీనర్ గుత్రం శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గోపికష్ణ, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజ్ వీర్, ఫిషరీస్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గౌటి బాబేష్, మండల ఎస్సి సెల్ అధ్యక్షుడు బింగి యాదగిరి, కిసాన్ సెల్ అధ్యక్షుడు రాజేశం గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కరుణాకర్, మండల మహిళ కాంగ్రెస్ అధ్యక్షులు లత రెడ్డి, నాయకులు బిట్ల శ్రీనివాస్, అశోక్, శ్రీనివాస్, కనకయ్యా, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నీటి చుక్కనూ ఒడిసి పట్టుకోవాలి

నవతెలంగాణ-మద్దూరు

ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలని సలాక్ పూర్ ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా సలాక్ పూర్, మద్దూరు, గ్రామాలలో బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత ప్రజలకు నీటి విలువపై ప్రజలకు అవగాహన కల్పించారు, అనంతరం విద్యార్థులకు బాలవికాస్ ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ..ప్రపంచంలో నీటి విలువ గొప్పదని ప్రతి ఒక్కరు నీటిని ఒడిసి పట్టుకొని పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు జనార్దన్ రెడ్డి, బందారం శ్రీనివాస్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేష్మ షౌకత్, ప్రతాప్, శ్రీశైలం గౌడ్, బాలవికాస నిర్వాహకులు ఎస్ విమల్, కోడిపెల్లి నరేష్, గుంటిపల్లి నారాయణ, తదితరులు పాల్గొన్నారు

మీడియా సర్టిఫికేషన్‌పై కలెక్టర్ సమావేశం

నవతెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్



లోక్ సభ ఎన్నికల సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల నిర్వహణలో ఎంసీఎంసీ కీ కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే పెయిడ్ న్యూస్ ల గుర్తింపు, పొలిటికల్ అడ్వర్టైజ్మెంట్‌లు, ప్రీ సర్టిఫికేషన్ మానిటరింగ్ ఇతర మీడియా సంబంధిత విధులను ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నిబంధనలకు లోబడి నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో డిపిఆర్‌ఓ రవికుమార్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి

నవతెలంగాణ -నంగునూరు




మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తామని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, సొసైటీ చైర్మెన్ కోల రమేష్ గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నంగునూరు మండలంలోని పాలమాకుల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశం లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వేముల వెంకట్ రెడ్డి, తాజా, మాజీ సర్పంచ్ పంగ కుమార్ బీఆర్ఎస్ నాయకులు వేణు చక్రవర్తి, పర్శరాములు గౌడ్,జాజల చందు, రమేష్ గౌడ్ బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ సమావేశం

హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-మర్కుక్



అందరూ సమన్వయంతో పనిచేసి బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థులను గెలిపించికోవాలని మాజీ ముఖ్యమంత్రి , గజ్వేల్ ఎమ్మెల్యే కె.చంద్రశేఖర్ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని ఎర్రవల్లిలో గల తన వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ మెదక్ పార్లమెంటు నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మెదక్ పార్లమెంటు అభ్యర్థి గా ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి , నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి గా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను ప్రకటించారు.బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం అందరూ సమిష్టిగా పనిచేయాలన్నారు. త్వరలోనే నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు,కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి ,ఎమ్మెల్సీలు యాదవరెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు మదన్ రెడ్డి, పద్మాదేవేందర్ రెడ్డి, నాయకులు ప్రతాప్ రెడ్డి, ఎలక్షన్ రెడ్డి ,ముఖ్య నేతలు హజరైయ్యారు.

ఈవీఎం గోదాంలో మిషన్ల పరిశీలన

- ఎలాంటి పొరపాట్లు రాకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనోజ్ చౌదరి ఆదేశం

నవ తెలంగాణ - సిద్దిపేట కలెక్టరేట్



లోక్ సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి కలెక్టరేట్ పక్కన గల ఎన్నికల ఈవీఎం గోదాంను సందర్శించారు. లోక్ సభ ఎన్నికలలో ఉపయోగించుటకు ఈవీఎం మిషన్లు సిద్ధం చేయడం మరి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వాటిని పంపిణీ ప్రక్రియ సంబంధించిన ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈవీఎంల రాండమైజేషన్ పంపిణీల సందర్భంగా టెంట్, టేబుల్స్, తాగునీటి వసతి, పొలిటికల్ పార్టీల ప్రతినిధులు , అధికారులకు వేరువేరుగా కుర్చీలు ఇతరత్రా అన్ని సౌకర్యాలతో ఎలాంటి చిన్న పొరపాటు జరగకుండా ఏర్పాట్లు చెయ్యాలని కలెక్టరేట్ ఏవో రెహమాన్ ను ఆదేశించారు. గోదాం చుట్టూ 24/7 గట్టి బందోబస్తుతో విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన దీపికలు

నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ మండలం బూర్గుపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇటీవల టీ వై ఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజు సౌజన్యంతో దాదాపు మూడు వందలకు పైగా పుస్తకాలు ఒక బీరువాను పాఠశాల గ్రంథాలయానికి అందజేశారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి తో కలిసి పాల్గొన్న టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు వి. సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన దీపికలు అని విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని, మా పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు బీరువా అందజేసిన తలకొక్కుల రాజుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గ్రంథాలయ ఇన్చార్జి శ్రీమతి ఎస్ సుధాశ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు. ఎం శ్రీనివాస్, టీ శ్రీనివాస్ రెడ్డి, ఎండి బషిరుద్దీన్, అర్జున్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

శేషసాయి మందిరంలో కోటి తలంబ్రాల దీక్ష

నవతెలంగాణ -గజ్వేల్

భద్రాచల కల్యాణానికి ఉపయోగించే గోటి తలంబ్రాల కార్యక్రమం శుక్రవారం శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో గజ్వేల్ లక్ష్మీ ప్రసన్న కాలనిలోని శేషసాయి మోక్షమందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామ నామాన్ని స్మరిస్తూ గోటితో ఒడ్లు ఒలిచి సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు కు అక్కడే అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు యెల్లు రాంరెడ్డి, అర్చకులు గోపినాథ్ శర్మ సదానందం, హరి, సుమన్, మల్లారెడ్డి, అడ్వకేట్ గోపాలరావు, పేర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.